
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 24 అక్టోబరు 2025

● వైభవంగా గాజుల మహోత్సవం



ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం గాజుల అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ 6

జిల్లాలో కుండపోతగా వర్షం పడింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. రహదారులపై మోకాలి లోతు నీరు ప్రవహించింది. ప్రధాన డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక చోట్ల వరి నేలవాలింది. బంగాళాఖాతంలో శుక్రవారం మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. కోస్తాతీరం వెంబడి ఈ నెల 27వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షాలు, 28వ తేదీన భారీ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ స్పష్టం చేసింది.



మచిలీపట్నం రైతు బజారు రోడ్డులో మోకాలి లోతు నీటిలో చిరు వ్యాపారులు

జలమయం

- జిల్లాలో కుండపోత వర్షం
- కాలనీలు, లోతట్టు ప్రాంతాలను చుట్టుముట్టిన నీరు
- రహదారులపై మోకాలి లోతు ప్రవాహం
- నేలవారిన వరి పొలాలు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు



నాగాయలంకలో నీట మునిగిన పాఠశాల ఆవరణ



కూచిపూడిలో నేలవాలిన వరి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో గురువారం భారీ వర్షం పడింది. ఉదయం 8.30 గంటల వరకు మచిలీపట్నంలో అత్యధికంగా 112.6 మిల్లీమీటర్లు, పెదపారుపూడిలో అత్యల్పంగా 11.0 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 34.6 మిల్లీమీటర్లుగా ఉంది. సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. నాగాయలంకలో 76.8 మిల్లీమీటర్లు, బంటుమిల్లిలో 56.2, ఘంటసాలలో 54.2, గుడ్లవల్లేరులో 46.4, మొవ్వలో 44.8, చల్లపల్లిలో 40.2, అవనిగడ్డలో 38.2 మోపిదేవిలో 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో 25 మిల్లీమీటర్ల కంటే తక్కువగా వర్షం పడింది.

వరి పొలాలకు చేటు!

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. గురువారం భారీవర్షం విరామం లేకుండా పడింది. దీంతో ఈత, కంకులు పాలుపోసుకునే దశలో ఉండటంతో కంకుల సుంకు రాలిపోతుందని, దీని ప్రభావంతో గింజలు పాలుపోసుకోవని, వరి కంకుల్లో తప్ప, తాలు శాతం పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది దిగుబడులపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక వరికి తెగుళ్ల, దోమపోటు అధికమవుతుందని చెబుతున్నారు. ముతక రకాలైన ఎంటీఎం-1061, 1077, 1318, 1262 రకాలకు సంబంధించిన ఈత దశలో ఉన్న వరిపైరు ఏపుగా ఎదిగింది. వర్షం కారణంగా కంకులు బరువెక్కి నిదానంగా పైరు నేలవాలుతుంది. ఇలా వాలిపోయిన వరిపైరు రెండు రోజులకు పైబడి నీటిలోనే ఉండిపోతే కంకులు, పైరు కుళ్లిపోతాయి. బీపీటీ-5204 వంటి సన్నరకాల వరిపైరు దుబ్బులు సున్నితంగా ఉండటంతో ఈరకం పైరు కంకుల బరువు కారణంగా త్వరితగతిన నేలవాలుతుందని రైతులు చెబుతున్నారు. కోతకు సిద్ధమైన సన్నరకాల ధాన్యం నేలవాలితే గింజలు నీటిలోనే ఉండిపోయి మొలకెత్తే ప్రమాదం లేకపోలేదని రైతులు భయపడుతున్నారు.

కాల్వలను తలపించిన రహదారులు

మచిలీపట్నంలో భారీ వర్షం కురవడంతో ప్రధాన రహదారితో పాటు బస్టాండ్ ఆవరణ, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి మిగతా 6లో..

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో 08672 252572 నెంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎప్పటికపుడు ఆయా మండలాల్లో నెలకొన్న పరిస్థితులకు సంబంధించిన సమాచారం తెలుసుకుంటున్నారు. ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిస్థితులను అంచనా వేసి సమాచారం తెలియజే యాలని కలెక్టర్ బాలాజీ ఆదేశాలు జారీ చేశారు.

సరుకు రవాణాకు సులభమైన మార్గం

- విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ అవసరం
- సింగపూర్ సర్వీసు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డిమాండ్
- ఇప్పటివరకు కృష్ణాజిల్లా పీతలు చెన్నై నుంచి సింగపూర్‌కు ఎగుమతి
- ఇంటర్నేషనల్ కార్గో స్క్రీనింగ్ వస్తే ఇక్కడి నుంచే నేరుగా పంపించొచ్చు
- విదేశాలకు సరుకు రవాణా చేయడానికి అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయం నుంచి షార్జాకు విమాన సర్వీసు నడుస్తోంది. కొద్దిరోజుల్లో సింగపూర్‌కు సర్వీసు నడుస్తుంది. దుబాయ్, తదితర దేశాలకు కూడా సర్వీసులు నడిచే అవకాశం ఉంది. విదేశాలకు వెళ్లే విమానాల్లో ప్రయాణికులతో పాటు కార్గో రవాణా కూడా చేయొచ్చు. దాదాపు ఐదారు టన్నుల కార్గోను రవాణా చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్నేషనల్ కార్గో స్క్రీనింగ్ లేకపోవటం వల్ల విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి కేవలం ప్రయాణికులే తప్ప సరుకును రవాణా చేయలేని పరిస్థితి ఏర్పడింది. వచ్చేనెల 10 నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ సర్వీసు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా మిగతా 6లో..

- పార్టీ, సంస్థాగత పదవుల విషయంలో రాజుకున్న గొడవ
- తిరువూరులో ఒకేరోజు ఇద్దరూ పోటాపోటీ కార్యక్రమాలు
- డబ్బు తీసుకుని పదవులు ఇచ్చారంటూ కొలికపూడి ఆరోపణలు
- ఇసుక, పేకాట క్లబ్‌లు, గంజాయి వ్యాపారం చేయిస్తున్నారని వ్యాఖ్య
- వైసీపీతో కొలికపూడి అంటకాగుతున్నారన్న ఎంపీ కేశినేని
- వైసీపీ కోవర్టులకు పదవులు ఇవ్వరని ప్రతిగా కౌంటర్
- తనకు డబ్బు ఇచ్చావంటే ఎవరూ నమ్మరని సమాధానం



కేశినేని శివనాథ్



కొలికపూడి శ్రీనివాసరావు

పదవుల ఫైట్

ఎంపీ కేశినేని శివనాథ్ వర్సెస్ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరువూరు నియోజకవర్గంలో కొద్దిరోజుల కిందట సంస్థాగత పార్టీ పదవులకు సంబంధించి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. తన ప్రమేయం లేకుండా పదవుల ఎంపిక జరిగిందని ఎమ్మెల్యే శిబిరం ఆరోపిస్తుండగా, పార్టీకి పనిచేసిన వారికే పదవులు ఇచ్చామని ఎంపీ శిబిరం చెబుతోంది. సంస్థాగత పదవుల వ్యవహారంతో మొదలైన వివాదం ఆ తర్వాత సొసైటీ ఛైర్మన్ల ఎంపికతో ముదిరి పాకాన పడింది. వారం రోజులుగా ఇరుపక్షాల మధ్య పరోక్షంగా మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. ఎంపీ కార్యాలయంలోని కిషోర్, సూరపనేని రాజాపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఎంపీ అనుచరులు కూడా ప్రతిగా ఎమ్మెల్యే కొలికపూడి, ఆయన అనుచరుల వ్యాఖ్యలకు కౌంటర్లు ఇస్తూ వస్తున్నారు. తిరువూరులో గురువారం గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు, వాటి పరిష్కారం, ప్రజల నుంచి సలహాల స్వీకరణ పేరుతో ఎంపీ కేశినేని శివనాథ్ కార్యక్రమాలు చేపట్టారు. ఇదే క్రమంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వారి పరామర్శల పేరుతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇద్దరూ వేర్వేరుగా కార్యక్రమాలకు పిలుపునివ్వటంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెండుగా చీలిపోయి ఆ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటల తూటాలు పేలాయి.

పదవుల వివాదమా? వ్యక్తిగతమా?

తిరువూరు మండల పార్టీ అధ్యక్షుడిగా దుబ్బాకు వెంకటేశ్వరరావును నియమించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్ అయిన దుబ్బాకు ఆ తర్వాత వైసీపీలోకి వచ్చి తిరిగి టీడీపీలో చేరారు. వయోభారం కారణంగా తాను పనిచేయలేనని చెప్పినప్పటికీ ఆయనకు ఆ పదవి ఇచ్చారని ఎమ్మెల్యే కార్యాలయం గుర్రుగా ఉంది. ఈ పదవికి మేకల చంద్ర, మల్లెల శ్రీనివాస్ వంటివారు కూడా పోటీ పడ్డారు. గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా వి.రామకృష్ణను నియమించారు. ఇలా మండల, టౌన్ పార్టీ సంస్థాగత పదవులకు పలువురిని నియమించారు. ఈ పదవుల జాబితాను మిగతా 6లో..

అవినీతి ఆటంబాంబ్

- వాణిజ్యపన్నుల శాఖ మూడో డివిజన్‌లో దీపావళి డీల్
- గుడివాడలో ఇద్దరు డీలర్ల నుంచి రూ.25 లక్షల వసూలు
- రూ.30 కోట్ల విలువచేసే సరకును రూ.కోటిగా చూపించినందుకే..
- చక్రంతిప్పిన నలుగురు.. వారిలో ఇద్దరు అధికారులు, ఇద్దరు ఉద్యోగులు
- డీలర్లు, అధికారులకు మధ్య సంధానకర్తగా వ్యవహరించిన ఎస్టీపీ



ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపితే, వాణిజ్యపన్నుల శాఖలోని మూడో డివిజన్‌ను మాత్రం నోట్ల కట్టలతో ముంచేసింది. పన్నులు చెల్లించకుండా ఇతర రాష్ట్రాల నుంచి దీపావళి సరకును రప్పించుకున్న హోల్‌సేల్ డీలర్లకు అయాచితంగా మేలు చేకూర్చినందుకు ఈ డివిజన్‌కు చెందిన అధికారులకు భారీగా ముడుపులు అందాయి. ఈ విషయం ప్రస్తుతం వాణిజ్యపన్నుల శాఖలో దుమారాన్ని రేపుతోంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గవర్నరుపేట సర్కిల్‌లోని సబార్డినేట్ కొండపల్లి శ్రీనివాసరావు ట్రాన్స్‌పోర్టు వ్యాపారి నుంచి డబ్బు వసూలు చేసి ఏసీబీకి చిక్కి కొద్దిరోజులు కూడా గడవకుండానే అధికారులు, సిబ్బంది ఎలాంటి జంకుబెంకు లేకుండా వసూళ్లకు ద్వారాలను తెరిచారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలు చేయడం ప్రారంభించాక వాణిజ్య పన్నుల శాఖలో అధికారులు, సిబ్బంది ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఈ విషయాన్ని వ్యాపారులు, హోల్‌సేల్ డీలర్లే బహిరంగంగా చెబుతున్నారు. వాణిజ్యపన్నుల శాఖ మూడో డివిజన్‌లో ఇద్దరు అధికారులు, ఇద్దరు సిబ్బంది కలిసి దీపావళి టపాసులు విక్రయించే హోల్‌సేల్ డీలర్ల నుంచి ఏకంగా రూ.25 లక్షలు వసూలు చేశారు. ఈ విషయం ఆ శాఖలోని అన్ని డివిజన్లలో చర్చకు దారితీసింది.

రూ.కోట్ల సరకును దాచేసి..

వాణిజ్యపన్నుల శాఖ మూడో డివిజన్‌లో మొత్తం ఐదు సర్కిళ్లు ఉన్నాయి. ఈ కార్యాలయం అయోధ్యనగర్‌లోని లోటస్‌లో ఉంది. గుడివాడ, మచిలీపట్నం, పెనమలూరు, రామవరప్పాడు, పటమట సర్కిళ్లు ఈ మూడో డివిజన్‌లో పరిధిలో ఉంటాయి. ఇందులో గుడివాడ సర్కిల్ ఈ డివిజన్‌కు గుండెకాయ వంటిది. హోల్‌సేల్ వ్యాపారులు, డీలర్లు ఎక్కువగా ఉండేది ఈ సర్కిల్‌లోనే. తర్వాత పెనమలూరు సర్కిల్‌లోని గన్నవరంలో ఈ డీలర్లు ఉంటారు. మచిలీపట్నం సర్కిల్‌లో మినీ హోల్‌సేల్ డీలర్లు ఉంటారు. దీపావళికి శివకాశి, తమిళనాడు నుంచి దీపావళి సరకును ఈ డీలర్లు రప్పిస్తుంటారు. ఇది ఏటా జరిగే ప్రక్రియ. ఈ ఏడాది గుడివాడలో ఇద్దరు ప్రముఖ డీలర్లు రూ.కోట్ల సరకును దిగుమతి చేసుకున్నారు. దీనికి ఎలాంటి వేబిల్లులు, ప్రభుత్వానికి పన్నులు చెల్లించలేదు. ఈ ఇద్దరు డీలర్లు రూ.కోటి సరకే తమ వద్ద ఉన్నట్టు చూపించారు. వాస్తవానికి వారి వద్ద రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు విలువచేసే సరకు ఉంది. దీన్ని వారు ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలోని వ్యాపారులకు సరఫరా చేశారు. ఎలాంటి బిల్లులు లేకుండా అంత మొత్తంలో సరకును దిగుమతి చేసుకున్న ఈ డీలర్లతో పాటు మినీ హోల్‌సేల్ డీలర్ల గోదాములు, షాపుల్లో తనిఖీలు చేయకుండా భారీ మొత్తంలో ముడుపులు అందుకున్నారు.

ఆ నలుగురు కనుసన్నల్లో..

గుడివాడలోని ఇద్దరు ప్రముఖ హోల్‌సేల్ డీలర్లతో పాటు మినీ హోల్‌సేల్ వ్యాపారుల నుంచి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేశారు. డివిజన్‌లో పనిచేసే ఇద్దరు అధికారులు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్ల కనుసన్నల్లో ఈ దీపావళి డీల్ నడిచినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాణిజ్యపన్నుల శాఖలోని ఉద్యోగవర్గాలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. వ్యాపారులకు, అధికారులకు మధ్య ఒక ఎస్టీపీ (సేల్స్‌ట్యాక్స్ ప్రాక్టీషనర్) అనుసంధానకర్తగా వ్యవహరించాడు. జీఎస్టీ తగ్గింపునకు సంబంధించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు మచిలీపట్నంలో సూపర్ జీఎస్టీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేసే హడావిడిలో ఉన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న ఈ నలుగురు కలిసి ఎస్టీపీ ద్వారా వసూళ్ల కథను నడిపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశిస్తారా, ఇదంతా మామూలే అన్నట్టుగా వదిలేస్తారా చూడాలి.

లే అవుట్‌లు!

ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు: గత వైసీపీ ప్రభుత్వంలో తోట్లవల్లూరు మండలంలో జగనన్న కాలనీల నిర్మాణానికి జరిగిన భూముల కొనుగోలు పెద్ద అవినీతి కూపంగా మారింది. మండలంలోని 16 గ్రామాల్లో 20 జగనన్న లే అవుట్‌లు వేశారు. వీటిల్లో తొమ్మిది లే అవుట్‌లలో నేటికీ ఒక్క గృహం కూడా నిర్మాణం కాలేదంటే అవి ఎంత అధ్వాన్న ప్రదేశాల్లో ఉన్నాయో అర్థమవుతోంది. రొయ్యూరు, యాకమూరు, బొడ్డపాడు, చినపులిపాక, వల్లూరుపాలెం లే అవుట్‌లు నాటి వైసీపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలకు దర్పణం పడుతున్నాయి.

వైసీపీ నేత భూమి చుట్టూ లే అవుట్!

రొయ్యూరులో ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏనుగులకోడు డ్రెయిన్ పక్కన కొనుగోలు ఏసిన 3.14 ఎకరాల వ్యవసాయ భూమి భారీ అవినీతి, అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఓ వైసీపీ నేత భూమి చుట్టూ జగనన్న లే అవుట్ వేశారు. ఆ వైసీపీ నేత భూమికి విలువ పెంచేందుకు మాత్రమే ఇది ఉపయోగపడింది. ఇక్కడ 111 ప్లాట్లు వేసి పట్టాలు పంపిణీ చేసినా స్థలం మెరక, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించకుండా వదిలేశారు. కేవలం కరెంటు స్తంభాలు మాత్రమే వేశారు. వర్షం వస్తే మోకాలు లోతు మురుగు చేరుతోంది. ఇక్కడ ఒక్క లబ్ధిదారుడు గృహం నిర్మించేందుకు ముందుకురాని పరిస్థితి నెలకొంది. రొయ్యూరు జగనన్న లే అవుట్‌లోకి ఓ రైతు చొచ్చుకు వచ్చి వరినాట్లు కూడా వేయటం గమనార్హం.

- అనువుగాని చోట జగనన్న లే అవుట్‌లు
- ఇళ్ల నిర్మాణానికి ముందుకురాని లబ్ధిదారులు
- తోట్లవల్లూరు మండలంలో ఖాళీగా 9 లే అవుట్‌లు
- రొయ్యూరు లే అవుట్ మధ్యలో వైసీపీ నేత పొలం
- ఇళ్ల స్థలాల భూమిలోనూ వరినాట్లు

లోతట్టు భూమిలో ఇళ్ల స్థలాలు

యాకమూరులో కనకవల్లి డ్రెయిన్ అవతల దారీతెన్నులేని చోట పక్కా వైసీపీ సానుభూతి రైతుకు చెందిన 3.27 ఎకరాల లోతట్టు భూమిని అధికారులు సేకరించారు. 126 ప్లాట్లతో లే అవుట్ వేసి, 120 మందికి పట్టాలు పంపిణీ చేశారు. కనీసం ప్లాట్లు మెరక కూడా చేయకుండా వదిలేశారు. ఇక్కడకు రావాలంటే కనకవల్లి డ్రెయిన్‌పై కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టాలి. లేదంటే తోట్లవల్లూరు రోడ్డు నుంచి డొంక మార్గంగా రావాలన్నా సాధ్యం కాని పరిస్థితి ఉంది.



రొయ్యూరులో జగనన్న లే అవుట్‌లో వేసిన వరినాట్లు

పొలాల మధ్య లే అవుట్‌లు

బొడ్డపాడులో పెద ఓగిరాల వెళ్లే రోడ్డు వెంట చెరువు అవతల మాగాణి పొలాల మధ్య 2.75 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి 90 ప్లాట్లు వేసి, 89 మందికి పట్టాలు పంపిణీ చేశారు. చినపులిపాకలో వల్లూరుపాలెం రోడ్డు వెంట కాలినడక దారి లేని చోట పొలాల మధ్య 2.29 ఎకరాలు కొనుగోలు చేసి 93 ప్లాట్లు వేసి 76 మందికి పట్టాలు ఇచ్చారు. లే అవుట్‌ల మెరక చేయలేదు.

గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన జగనన్న లే అవుట్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రజల నివాసయోగ్యతకు వీలుకాని చోట స్థలాలు ఇవ్వడంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు ఐదేళ్లుగా అటువైపు కన్నెత్తి చూడటంలేదు. కమీషన్‌లకు కక్కుర్తిపడి ఎక్కడో ఊరికి దూరంగా పొలాల మధ్య దారీతెన్ను లేని చోట్ల భూములను కొనడమే ఈ దుస్థితికి కారణం. ప్రజలెలా జీవిస్తారు అన్న ఇంగిత జ్ఞానం లేకుండా నాటి అధికారులు, వైసీపీ పెద్దలు కలిసి రొయ్యూరు, బొడ్డపాడు, చినపులిపాక, యాకమూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో జగన్‌నన్న లే అవుట్‌లు వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెరక చేసినా నిరుపయోగమే!

వల్లూరుపాలెంలో బస్‌షెల్టర్ నుంచి ఏనుగులకోడు డ్రెయిన్‌కు వెళ్లే డొంక పక్కన గ్రామానికి దూరంగా 5.53 ఎకరాల్లో జగనన్న లే అవుట్ వేసి 220 మందికి పట్టాలు పంపిణీ చేశారు. స్థలాలకు మెరక తోలినా ప్రజలు గృహాల నిర్మాణానికి వెనుకంజ మిగతా 6లో..



నిందితుడిని పోలీస్ స్టేషన్ నుంచి రోడ్డుపై నడిపించుకుంటూ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తీసుకువెళుతున్న పోలీసులు

నడిరోడ్డుపై నడిపించుకుంటూ..

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు

ఉయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని పోలీసులు నడిరోడ్డుపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లిన ఘటన గురువారం ఉయ్యూరులో జరిగింది. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చిన్నారులతో కలిసి ఆడుకుంటున్న మేనకోడలు వరసయ్యే చిన్నారికి చాక్లెట్లు ఆశ చూపి షేక్ చాన్ బాషా(30) పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను చాకుతో బెదిరించేవాడు. రెండు రోజుల క్రితం విషయం బయటకు పొక్కడంతో స్థానికులు యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్ నుంచి ఉయ్యూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వరకు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి నవంబరు 5వ తేదీ వరకు నిందితుడికి రిమాండ్ విధించారు.

కృష్ణాలో అడ్మిషన్లు అంతంతే! 6

విదేశీ కష్టాల నుంచి విముక్తి కల్పించరూ..

- కువైట్ నుంచి జింజేరు గ్రామ మహిళ వేడుకోలు
- మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు వినతి
- స్పందించిన ఎమ్మెల్యే.. తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు

క్లీనింగ్‌కు అని తీసుకొచ్చి ఇంటిపని, వంట పని మొత్తం చేయిస్తున్నారు.. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తూనే ఉండాలి.. కంటినిండా నిద్ర లేదు.. ఇంట్లో పిల్లలు మీదపడి హింసిస్తున్నారు. వారికి ఏదైనా ఐతే నాదే బాధ్యత అంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు.. వెళ్ళిపోదామంటే రెండు లక్షలు కట్టమంటున్నారు.. నన్ను కాపాడండి.. ఇండియాకు తీసుకెళ్లండి.. ప్లీజ్! అంటూ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌లను వేడుకుంటోన్న మహిళ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.


దాసి శాంతి

పెడనరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బ్రతుకు తెరువు కోసం దేశం కాని దేశానికి వెళ్లి అక్కడ నానా బాధలు పడుతున్న ఓ మహిళ దీన గాథ ఇది. పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన దాసి శాంతి స్థానికంగా టైలరింగ్ పనులు చేస్తుంటుంది. ఆమెకు అనారోగ్యంతో బాధపడుతున్న భర్త, ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ పెళ్లి చేసి అత్తారిళ్లకు పంపారు. అనారోగ్యంతో ఉన్న భర్త శ్యామ్‌బాబుకు ఆపరేషన్ చేయించే క్రమంలో వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అప్పులు చేశారు. అప్పులిచ్చిన వారి నుంచి వత్తిడి పెరడంతో శాంతి కృత్తివెన్ను మండలం పడతడిక గ్రామానికి చెందిన తమ బంధువు నవీన్‌ను కలిసి కువైట్‌కు పంపితే టైలరింగ్ పనిచేసుకుని అప్పుల బాధ నుంచి బయటపడతానని చెప్పింది. టైలరింగ్ వృత్తి కుదరదని, ఇంటి పనుల నిమిత్తం అయితే కువైట్ పంపిస్తానని నవీన్ చెప్పడంతో అందుకు శాంతి అంగీకరించింది. గతనెల 18న ఆమె కువైట్ వెళ్లి అక్కడ ఓ ఇంట్లో పనిమనిషిగా చేరింది. అయితే ఇంటి యజమాని వెట్టి చాకిరీ చేయిస్తున్నాడని, ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు విరామం లేకుండా పనులు చేయాల్సి వస్తోందని.. పిల్లలు అల్లరి చేసినా, తప్పులు చేసినా అందుకు తానే బాధ్యురాలినంటూ యజమాని తరచూ వేధించేవాడని శాంతి పేర్కొంది. వెట్టి చాకిరికి తోడు అక్కడి వాతావరణం సరిపడక శాంతి తీవ్ర అనారోగ్యానికి గురైంది. తిరిగి వచ్చేద్దామంటే డబ్బు లేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో తనను జింజేరు గ్రామం తీసుకువచ్చేయమని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లను వేడుకుంటూ కన్నీటిపర్యంతమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ శాంతి బంధువైన నవీన్‌ను కలిసి శాంతిని జింజేరు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వర్షాలతో వరికి తీవ్ర నష్టం!


- నేలకొరిగిన చేలు.. ఆందోళనలో అన్నదాత

కూచిపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా పలుగ్రామాల్లో వరిచేలు నేలకొరిగాయి. ఈనిక దశ, గింజ గట్టిపడే దశల్లో ఉన్న పొలాలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుంకు రాలిపోయి నష్టం కలుగుతుందని పేర్కొంటున్నారు. మరో నాలుగైదు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పంట నష్టం ఏ మేరకు ఉంటుందోనని రైతులు కంటిమీద కునుకు లేకుండా కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ఏడాది మొవ్వ మండలంలో 11,250 హెక్టార్లలో రైతులు వరిసాగు చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత సైతం తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి సాగుచేసిన వరి మరో 20రోజుల్లో కోతకు వచ్చే తరుణంలో కురుస్తున్న వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి.

అంగలూరు డైట్‌లో పోస్టులకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు డైట్‌లో ఖాళీగా ఉన్న రెండు సీనియర్ లెక్చరర్, ఆరు లెక్చరర్ పోస్టులు డిప్యూటేషన్ పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 31లోగా 58 ఏళ్లు మించరాదని, సబ్జెక్టుల్లో 55శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని, సర్వీసు ఐదేళ్లు పూర్తిచేసి ఉండాలని తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు అర్హులు కాదన్నారు. దరఖాస్తులు గూగుల్ ఫారంలో సమర్పించాలన్నారు. ఎంపికయిన అభ్యర్థులకు నవంబరు 1 నుంచి 8వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో ఇంటర్వ్యూలు జరుపుతామన్నారు.

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు మురళీకృష్ణ



వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు, దేవి శ్రేష్ఠ గోల్డ్ డైమండ్స్ వ్యాపార నిర్వాహకులు బొడ్డు మురళీకృష్ణ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు సూచన మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోంట్ల రామమోహన్ గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. మురళీకృష్ణ వాసవి క్లబ్ అంతర్జాతీయ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సభ్యులు, పేదలకు వివిధ రకాలుగా తోడ్పాటు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మురళీకృష్ణ నియామకం పట్ల జిల్లా, మండల ఆర్యవైశ్య, వాసవి ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు శుక్రవారం నాడు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నారు. డీఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా, కేంద్రమంత్రి నేరుగా ఉద్యోగాలు పొందిన 68మందికి నియామక పత్రాలు అందజేస్తారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు పాల్గొననున్నారు.


అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న శాప్ చైర్మన్

క్రీడా కోచ్‌లకు నియామక పత్రాల అందజేత

విజయవాడ స్పోర్ట్స్ : రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 13ఔట్‌సోర్సింగ్ కోచ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం శాప్‌కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి శాప్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర విభజన అనంతరం క్రీడాప్రాధికార సంస్థ తొలిసారిగా పారాస్పోర్ట్స్, షూటింగ్ విభాగాలకు కోచ్‌లను నియమించడం క్రీడాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. 13మంది కోచ్‌లు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తమ సేవలను అందించనున్నారని తెలిపారు.


అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గాజుల అలంకారంలో కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గాదేవి గురువారం యమద్వితీయను పురస్కరించుకుని గాజుల అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు, ఈవో శీనా నాయక్, దాతల సహకారంతో గాజుల ఉత్సవం ఘనంగా జరిగింది. 4,31,932 గాజులు భక్తుల నుంచి విరాళంగా వచ్చాయి. 300 మందికి పైగా సేవా సిబ్బంది 24 గంటలు పనిచేసి అమ్మవారి మూలవిరాట్టు, అంతరాలయాన్ని గాజులతో అలంకరించారు. గాజుల అలంకరణతో అంతరాలయం కాంతులీనింది. గాజుల అలంకారంలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


గాజుల అలంకారంలో దుర్గమ్మ ప్రధాన ఆలయం


కృష్ణాయూనివర్సిటీ

అడ్మిషన్లు అంతంతే!

- కృష్ణావర్సిటీలో వివిధకోర్సుల్లో అనుమతి ఇచ్చిన సీట్లు 454
- భర్తీ అయినవి 186, మిగిలిపోయినవి 268
- తరగతులు ప్రారంభమై నెలరోజులు
- హాస్టల్ భవనాలు లేకపోవడంతో విద్యార్థుల విముఖత
- మేనేజ్‌మెంట్ కోటాలో సీట్ల భర్తీ ఎప్పటికో..

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

కృష్ణాయూనివర్సిటీలో ఈ ఏడాది పీజీ కోర్సుల్లో ఆశించిన మేర విద్యార్థినీ, విద్యార్థులు చేరలేదు. యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నామని వర్సిటీ అధికారులు విస్తృత ప్రచారం చేసినా అడ్మిషన్‌ల విషయంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. పీజీ కోర్సులకు సంబంధించి 454 సీట్లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రెండు విడతలుగా జరిగిన కౌన్సెలింగ్‌లో ఆయా కోర్సుల్లో కేవలం 186మంది విద్యార్థులు మాత్రమే చేరారు. రెండు విడతలుగా కౌన్సెలింగ్ జరిగినా ఫలితంలేదు. మేనేజ్‌మెంట్ కోటాలో వివిధ కోర్సుల్లో ఎప్పుడు విద్యార్థులను చేర్చుకుంటారో యూనివర్సిటీ అధికారులు స్పష్టమైన తేదీలను ఇప్పటివరకు ప్రకటించలేదు. గతనెల 23నుంచి 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సులకు తరగతులు ప్రారంభమయ్యాయి.

కోర్సుల్లో విద్యార్థుల చేరిక ఇలా..

కృష్ణాయూనివర్సిటీలో వివిధ పీజీ కోర్సుల్లో రెండు విడతలుగా జరిగిన కౌన్సెలింగ్‌లో విద్యార్థినీ విద్యార్థుల అడ్మిషన్‌లకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంగ్లీష్ విభాగంలో 33సీట్లు ఉండగా ఒక్కరు మాత్రమే చేరారు. ఫిజిక్స్ విభాగంలో 33 సీట్లకుగాను ఒక్కరుకూడా చేరలేదు. మాథ్స్ విభాగంలో 33సీట్లకుగాను ఒక్కరుకూడా చేరలేదు. ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో 40సీట్లకుగాను 33మంది, అనలాటికల్ కెమిస్ట్రీ విభాగంలో 40సీట్లకుగాను 33మంది చేరారు. జువాలజీ విభాగంలో 33సీట్లకుగాను 9మంది చేరారు. బోటనీ విభాగంలో 33సీట్లకుగాను 10మంది చేరారు. ఎంబీఏ విభాగంలో 66 సీట్లకుగాను 39మంది, ఎంసీఏ విభాగంలో 66సీట్లకుగాను 39మంది చేరారు. ఎంకాం విభాగంలో 33 సీట్లకుగాను ఒక్కరుకూడా చేరలేదు. యూనివర్సిటీలో పది పీజీ కోర్సుల్లో 454 సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా కేవలం 186సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అన్ని కోర్సుల్లో 268 సీట్లు మిగిలిపోయాయి. వర్సిటీలో చేరేందుకు వచ్చిన కొందరు విద్యార్థినీ, విద్యార్థులు హాస్టల్స్ వసతి లేకపోవడంతో ఇక్కడ చేరినా వెనక్కి వెళ్లిపోయారు. ఎంఏ ఇంగ్లీష్ కోర్సులో గత నాలుగేళ్లుగా ఇద్దరు, లేక ముగ్గురే చేరుతున్నారు. వీరికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాఠాలు బోధిస్తున్నారు. ఏడాదికి ఈ కోర్సు నిర్వహణకు రూ.1.20కోట్ల వరకు ఖర్చు చేయడం గమనించదగ్గ అంశం. ఇంగ్లీష్ పీజీ కోర్సులో ఈ ఏడాది ఒక్కరే చేరినా ఈ కోర్సును కొనసాగిస్తున్నారు. ఎమ్మెస్సీ మాథ్స్, కెమిస్ట్రీ పీజీ కోర్సులను ఈ ఏడాది రద్దు చేసినట్టు సమాచారం. ఇంజనీరింగ్ కళాశాలకు భవనం లేకపోవడంతో ఈ రెండు కోర్సులకు సంబంధించిన నాలుగు గదులను ఇంజనీరింగ్ కళాశాలకు అదనంగా ఈ ఏడాది కేటాయించారు.

ఫుడ్‌కోర్టు అందుబాటులోకి వచ్చేనా..

ఈ ఏడాది జూన్ 25న కృష్ణాయూనివర్సిటీ 7, 8 స్నాతకోత్సవాలను నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్‌నజీర్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ రోజు యూనివర్సిటీప్రాంగణంలోని ఫుడ్‌కోర్టును గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. ఫుడ్‌కోర్టును ప్రారంభించి నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. ఫుడ్‌కోర్టును అందుబాటులోకి తెచ్చేందుకు టెండర్ల ప్రక్రియను ఎప్పటికి పూర్తిచేస్తారు. ఎప్పటికి అందుబాటులోకి తెస్తారనే అంశంపై యూనివర్సిటీ అధికారులు పెదవి విప్పడం లేదు.



దుర్గగుడిలో సహస్రలింగార్చన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా దుర్గగుడిలో గురువారం రాత్రి సహస్రలింగార్చన సేవ అత్యంత భక్తి నిష్ఠలతో సాగింది. నమక చమక పారాయణలతో ఆలయ ప్రాంగణం పులకించింది. ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి బృందం సహస్రలింగార్చన చేసి బిల్వ పత్రాలు, వివిధ పుష్పాలను సమర్పించారు. సహస్రలింగార్చన, సహస్రదీపార్చన, ఊంజల్ సేవల్లో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. ప్రదోష కాలంలో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. భక్తులచే ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) నిర్వహిస్తున్నారు.

బిఈడీ పరీక్షా ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బిఈడీ పరీక్షా ఫలితాలను కేయూ ఉపకులపతి కూన రాంజీ గురువారం విడుదల చేశారు. బిఈడీ 2వ సెమిస్టర్‌లో 1351 మంది పరీక్షలు రాయగా, 71 శాతంతో 961 మంది ఉత్తీర్ణులయ్యారు. స్పెషల్ బిఈడీ 2వ సెమిస్టర్‌లో 66 మంది పరీక్ష రాయగా, 85 శాతంతో 56 మంది ఉత్తీర్ణులైనట్టు పరీక్షల నియంత్రణ అధికారి బ్రహ్మచారి తెలిపారు. రీవాల్యుయేషన్ కోరు వారు నవంబరు 4లోగా నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

లే అవుట్‌లు!

(5వ పేజీ తరువాయి)

వేస్తున్నారు. పెనమకూరు లే అవుట్‌లో ఒకరిద్దరు నిర్మాణాలు చేపట్టి వదిలేశారు.

తోట్లవల్లూరులో నాటి ప్రభుత్వ వైఫల్యం!

తోట్లవల్లూరులో సుమారు 600 మంది లబ్ధిదారులను గుర్తించి 40 ఏళ్ల నుంచి 23 మంది ఎస్సీలు సాగు చేసుకుంటున్న తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని బలవంతంగా తీసుకుని జగనన్న లే అవుట్ వేయగా, ఎస్సీలు హైకోర్టులో కేసు వేసి స్టే తెచ్చుకున్నారు. నాటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైసీపీ నేతలు ఒక్కో ఎస్సీకి రూ.5 లక్షలు, మూడు సెంట్లు స్థలం ఇస్తామని, కోర్టులో కేసు ఉపసంహరించుకోవాలని ప్రతిపాదన చేశారు. దానికి ఎస్సీలు అంగీకరించారు. ఇంతలో ప్రభుత్వ భూమికి పరిహారం ఎలా ఇస్తామని చెప్పి తోట్లవల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ డొంకలో భద్రిరాజుపాలేనికి చెందిన వైసీపీ రైతుల నుంచి పదెకరాల భూమిని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఉండగా, సదరు రైతులకు డబ్బు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూములకు రేట్లు పెరగటంతో తమ భూములను వెనక్కి ఇచ్చేయాలని సదరు రైతులు రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇచ్చారు. దీంతో ఆ పదెకరాలు వెనక్కి వెళ్లిపోయే దుస్థితి ఏర్పడింది.

చాలా దూరంలో స్థలాలిచ్చారు



- సువర్ణగంటి మంగమ్మ, వల్లూరుపాలెం

వల్లూరుపాలెం లే అవుట్‌లో 2020లో సెంటున్నర స్థలం పట్టా ఇచ్చారు. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేవు. ఏడాదిన్నర క్రితం మెరక తోలారు. కాని ఎవ్వరు ముందుకు రావటం లేదు. రెల్లిదుబ్బులతో లే అవుట్ తయారయింది. దాంతో స్థలం ఇచ్చినా ఉపయోగం లేకుండా ఉంది.

యాకమూరు లే అవుట్‌కు దారేలేదు



- సమ్మెంట ధనలక్ష్మి, యాకమూరు

యాకమూరు లే అవుట్‌కు వెళ్లాలంటే దారీ తెన్నూ లేకుండా ఉంది. పట్టాలిచ్చినా అక్కడికి ఎవ్వరు వెళ్లే పరిస్థితి లేదు. నాకు ఇల్లు ఎంతో అవసరం. అద్దెకు ఉండాల్సి వస్తోంది. ఊరికి దగ్గర్లో ఇస్తే అందరికి ఉపయోగపడేవి.

ఉపయోగపడని చోట బొడ్డపాడు లే అవుట్



- మూడే శివశంకర్, సర్పంచ్, బొడ్డపాడు

బొడ్డపాడులో కేపీ సారథి కాలనీ వద్ద ఇళ్ల స్థలాలకు భూమి ఇచ్చేందుకు కొందరు ముందుకు వచ్చినా పెద ఓగిరాల రోడ్డు వెంట అనువుగాని ప్రదేశంలో జగనన్న లే అవుట్ వేశారు. మెరక చేయకుండా పట్టాలిచ్చారు. అక్కడికి ఎవ్వరు వెళ్లలేకపోతున్నారు. అంతేకాక ఔటర్ రింగ్ రోడ్డు లే అవుట్ నుంచి వెళుతుందని చెబుతున్నారు. అదే జరిగితే మళ్లీ వేరే చోట స్థల సేకరణ జరగాల్సి ఉంటుంది. ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి.

మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది



- ఎం.కుసుమకుమారి, తహసీల్దార్

లే అవుట్‌లలో ఇబ్బందులు ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వల్లూరుపాలెంలో మెరక చేసినా ఎవ్వరు ముందుకు రావటంలేదు. తోట్లవల్లూరులో భూములు వెనక్కి ఇవ్వమని రైతులు అర్జీలు ఇచ్చారు. ఇంకా వారి చేతికి తిరిగి ఇవ్వలేదు. బంగాళతోట భూముల్లో లే అవుట్ వేసినా కోర్టులో కేసు ఉంది.

పదవుల ఫైట్

(5వ పేజీ తరువాయి)

అప్పట్లో ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. ఆ రోజున అభ్యంతరాలు తెలపని కొలికపూడి రెండు నెలల తర్వాత అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోనూ ఇష్టానుసారంగా పదవులు ఇచ్చారన్న కారణంతో కొలికపూడి మరింత అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎంపీకి రూ.5 కోట్లు ఇచ్చానని, పదవులకు డబ్బు వసూలు చేశారని కూడా ఆయన ఆరోపణలు చేశారు.

వైసీపీ నేతలతో టచ్‌లో ఉంటున్నారా?

కొలికపూడి వైసీపీ కోవర్టుగా ఉన్నాడని ఎంపీ కేశినేని శివనాథ్ ఆరోపించటంతో ఆయన కదలికలపై అనుమానాలు నెలకొంటున్నాయి. వైసీపీ సర్పంచ్‌కు సీఎంఆర్ఎఫ్ డబ్బు ఇప్పించటంతో పాటు ఆ పార్టీ నాయకుల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. పేర్ని నాని, దేవినేని అవినాష్, కేశినేని నాని, స్వామిదాసులతో కలిసి తిరుగుతున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. కేశినేని వ్యాఖ్యలపై కొలికపూడి శ్రీనివాసరావు కూడా స్పందించారు. తాను జగన్‌పై పోరాడి రాజకీయాల్లోకి వచ్చానని, అమరావతి ఉద్యమాన్ని నడిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ తనను వైసీపీ కోవర్టుగా ఆరోపిస్తున్నవారే ఆ పార్టీ నేతలతో వ్యాపారాలు చేస్తున్నారని ఎంపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

వైసీపీ నేతలతో చెట్టపట్టాల్ వేసుకునే వారికి పదవులివ్వాలా?

- ఎంపీ కేశినేని శివనాథ్

ఎంపీగా నేను అందజేసిన సీఎంఆర్ఎఫ్ సహాయం ఎవరూ చేయలేదు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలను దృష్టిలో ఉంచుకుని సహాయం చేస్తాను. కొలికపూడి మాత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల కంటే కూడా వైసీపీ వారికి సహాయం చేస్తారు. వైసీపీ సర్పంచ్‌కు రూ.10 లక్షల సహాయం ఇప్పించారు. నేనెక్కడికి వెళ్లినా టీడీపీ, జనసేన నాయకులతో వెళ్తాను తప్ప.. వైసీపీ వారితో వెళ్లను. నేను తిరువూరు నియోజకవర్గంలో ఐదు రూపాయలు అయినా తీసుకున్నానని మీరు నమ్ముతారా? నా క్రెడిబిలిటీ అది. నేను నా సొంత డబ్బు ఖర్చు పెడతానే కానీ, ఎవరి వద్దా తీసుకోను. నాకు విజయవాడలో కానీ, రాష్ట్రంలో కానీ వ్యాపారాలు లేవు. హైదరాబాద్‌లో నా కుటుంబం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంది.

పదవులు అమ్ముకున్నారు

- కొలికపూడి శ్రీనివాసరావు, తిరువూరు ఎమ్మెల్యే

నా నియోజకవర్గంలో నేను చెప్పిన వారికి కాకుండా ఎంపీ చెప్పినట్టుగా పదవులు ఇచ్చారు. పేర్లు మారిపోయాయి. పదవులు ఇవ్వటానికి డబ్బు వసూలు చేశారు. సంస్థాగత పదవులతో పాటు పీఏసీల్లోనూ అన్యాయం జరిగింది. నాడు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పుడే నా దగ్గర ఎంపీ రూ.5 కోట్లు డబ్బు వసూలు చేశారు. నియోజకవర్గంలో నా ద్వారా జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. టెండర్లన్నీ రద్దు చేయిస్తున్నారు. ఇసుక, పేకాట క్లబ్‌ల నిర్వహణతో పాటు చివరికి గంజాయి బ్యాచ్‌తో కూడా వ్యాపారం చేయిస్తున్నారు. వైసీపీ నాయకులతో నేను తిరగటం లేదు. వారితో ఎంపీనే వ్యాపారాలు చేస్తున్నారు.

సరకు రవాణాకు సులభమైన మార్గం

(5వ పేజీ తరువాయి)

ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ డిమాండ్ చేస్తోంది.

కృష్ణాజిల్లా నుంచి పీతల రవాణా.. ఆదాయం తమిళనాడుకు

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, నాగాయలంక నుంచి ప్రతి రెండు, మూడు రోజులకు రెండున్నర టన్నుల పీతలను సింగపూర్‌కు రవాణా చేస్తున్నారు. సముద్రం నుంచి కొట్టుకొచ్చే 10 నుంచి 50 గ్రాములు కలిగిన పీతల పిల్లలు, వాటి పిల్లలను చెరువుల్లో పెంచుతున్నారు. ఇలా పెంచే వారంతా అర ఎకరంలోపు చెరువులు కలిగిన రైతులే. ఈ పీతలు నాలుగైదు నెలల్లోనే 500 గ్రాముల నుంచి కేజీ వరకు పెరుగుతాయి. వీటిని కొనడానికి ట్రేడర్లే వీరి దగ్గరకు వస్తారు. ఇలా కొన్న ట్రేడర్లు విదేశీ ఎగుమతి లైసెన్స్ కలిగిన ఎక్స్‌పోర్టర్లకు విక్రయిస్తారు. ఎక్స్‌పోర్టర్లు నేరుగా సింగపూర్‌లోని రెస్టారెంట్లకు, మార్కెట్లకు పంపిస్తారు. మచిలీపట్నం, నాగాయలంకకు చెందిన రైతులు కేజీ పీతలను 50-56 డాలర్లకు ట్రేడర్లకు విక్రయిస్తున్నారు. సింగపూర్‌లో వీటి ధర 200 డాలర్ల వరకు ఉంటోంది. దీనిని బట్టి ట్రేడర్లు, ఎక్స్‌పోర్టర్లకు ఎంత లాభం ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రస్తుతం సింగపూర్‌కు రవాణా చేయటానికి వీలుగా చెన్నైకు రోడ్డు మార్గంలో పంపిస్తున్నారు. అక్కడి నుంచి విమానాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. విజయవాడ నుంచి త్వరలో ప్రారంభమయ్యే సింగపూర్ విమాన సర్వీసుకు కస్టమ్స్ అండ్ కార్గో క్లియరెన్స్ ఉంటే రైతులకు, ట్రేడర్లకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. వేగంగా రవాణా చేయటానికి ఆస్కారం ఉంటుంది. ఇక్కడి నుంచి సింగపూర్‌కు కేవలం నాలుగు గంటల్లోనే రవాణా చేయవచ్చు.

ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ తప్పనిసరి

- పి.భాస్కరరావు, ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు

సింగపూర్‌కు విమాన సర్వీసుల ప్రారంభానికి ముందే విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటు కావాలి. లేదంటే కార్గో ప్రయోజనాలను కోల్పోతాం. ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. మేము ఇప్పటికే కార్గో స్క్రీనింగ్ గురించి డిమాండ్ చేశాం. సింగపూర్‌కు మన జిల్లా నుంచి పీతలు, చేపలు, పండ్లు, ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నారు. విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటు ద్వారా ఇక్కడి నుంచి నేరుగా ఎగుమతులకు అవకాశం ఏర్పడుతుంది. రైతులకు ప్రయోజనకరంగా మారుతుంది.

జలమయం

(5వ పేజీ తరువాయి)

వెళ్లే రహదారులపై మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు భారీగా చేరింది. గుడివాడ బస్టాండ్, ధనియాలపేట, కోతిబొమ్మ సెంటర్‌తో పాటు నగరంలోని రహదారులన్నింటిపై వర్షపు నీరు ప్రవహించింది. అవనిగడ్డ, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు పెద్దఎత్తున చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురుస్తూనే ఉండటంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

ఇసుక లారీల పట్టివేత

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై తెలంగాణాకు ఇసుక తరలిస్తున్న రెండు లారీలతో పాటు ఎస్కార్ట్‌గా ఉన్న కారు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని చిల్లకల్లు స్టేషన్‌కు తరలించినట్టు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాత్రి గస్తీలో భాగంగా పోలీస్ వాహనాన్ని చూసి హైవేపై లారీలను వదిలి డ్రైవర్‌లు పారిపోగా వారిలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిపారు. కొండపల్లి ఖిల్లా రోడ్డులో డంప్ వద్ద లోడు చేసుకున్నామని ఎస్కార్ట్‌గా కారు కూడా ఉందని ఇచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇసుక పాలసీ అమలులోకి వచ్చిన నాటినుంచి 15 నెలల కాలంలో అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి 105 కేసులు నమోదు చేసి 146 మందిని అదుపులోకి తీసుకుని 126 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. జగ్గయ్యపేట స్టేషన్‌లో ఎనిమిది కేసులు, 11 మంది వ్యక్తులు, తొమ్మిది వాహనాలు, పెనుగంచిప్రోలు పరిధిలో 14 కేసులు, 20 మంది వ్యక్తులు, 13 వాహనాలు, వత్సవాయి పరిధిలో 25 కేసులు, 43 మంది వ్యక్తులు, 39 వాహనాలు, చిల్లకల్లు పరిధిలో 60 కేసులు, 79 మంది వ్యక్తులు, 67 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.


పట్టుబడిన లారీలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

ఉంగుటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆసుపత్రులలో నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉంగుటూరులో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు నిలుపుదల చేయడంతో ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత లేక పేద, మధ్య తరగతి కుటుంబాల రోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లక్షలాది రూపాయలు ఉంటేనే ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు దక్కే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేటు ఆసుపత్రులకు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదలచేసి పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ2.30 లక్షలు



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీల కానుకలను గురువారం లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.వి.అనురాధ పర్యవేక్షణలో అర్చకులు, భక్తులు, సిబ్బంది కానుకలను లెక్కించారు. ఆరు నెలల ఆరు రోజులకు రూ.2,30,817 ఆదాయం లభించినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ, తదితరులు పాల్గొన్నారు. నూజివీడు మండలం సీతారాంపురం కేదారేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ కానుకలు గురువారం లెక్కించినట్లు ఈవో వై.శ్రీనివాస్ తెలిపారు. ఏడాది కాలానికి రూ.73,249 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు. ఆలయ ట్రస్టీ వజ్జా రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దాతల సేవాతత్పరత అభినందనీయం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి సహాయ సహాయ సహకారాలు అందిస్తూ ప్రజాసేవలో మేము సైతం అంటూ ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు ఐడీబీఐ బ్యాంకు అందజేసిన రూ. 5 లక్షలు విలువైన జనరేటర్‌ను, వైద్యశాలకు వచ్చే వారు కూర్చునేందుకు శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రమణ్యేశ్వరరావు రోటరీ క్లబ్ ద్వారా రూ. 1.50 లక్షలతో నిర్మించిన షెడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే దృక్పథంతో పనిచేసి, ప్రభుత్వం మీద ప్రజలకు విశ్వాసం పెంపొందేలా అధికారులు, నాయకులు కృషి చేయాలన్నారు. మెరుగైన వైద్యసేవలందించడం ద్వారా ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. వైద్యశాలకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చేందుకు విశేషంగా కృషి చేస్తున్న వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ అభినందనీయులన్నారు. నవంబరులో వైద్యశాలకు జనరల్ సర్జన్‌తో పాటు మరికొందరు నిపుణులైన వైద్యులు వస్తున్నారని డీసీహెచ్ ఎస్ శేషకుమార్ తెలిపారు. ఐడీబీఐ మేనేజర్ అనుదీప్, అసిస్టెంట్ మేనేజర్ ఆంజనేయులు, ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ఎస్. ప్రసాద్, కూటమి నాయకులు, వైద్యశాల సూపరింటెండెంట్ నాగస్వరూప, వైద్యులు సుజిత, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 13 మంది అరెస్టు

● రూ. 1.72 లక్షల స్వాధీనం


కంకిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో కోతముక్క ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని రూ.1.72 లక్షల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డి. సందీప్ తెలిపారు. మండల కేంద్రమైన కంకిపాడుకు చెందిన ఓ వ్యక్తి, కోలవెన్ను గ్రామానికి చెందిన మరో వ్యక్తి సాయంతో ఉప్పలూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని డబ్బులు పెట్టి కోత ముక్క ఆడిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న కంకిపాడు ఎస్సై డి.సందీప్ సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో 13 మందిని అదుపులోకి తీసుకుని, రూ.1,72,400 నగదు, 10 సెల్ ఫోన్లు స్వాదీన పరుచుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై డి.సందీప్ తెలియజేశారు.

కురుమద్దాలిలో జాబ్‌మేళా 29న

పామర్రు,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 29న కురుమద్దాలిలో గల స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు గురువారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. ఈమేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుత 10తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఎంపికైన వారికి రూ.8000 నుంచి రూ.20,000 వరకు జీతాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయంలో లక్షదీపార్చన

గుడ్లవల్లేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా బుధవారం రాత్రి వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో లక్షదీపార్చన కన్నులపండుగగా నిర్వహించారు. గుడివాడకు చెందిన భక్తులు ఇంటి రాము వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో లక్ష దీపార్చన నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. శంఖు, చక్ర నామాల ఆకృతుల్లో, ఓంకారం, స్వస్తిక్, త్రిసూలం, ఆకృత్రుల్లో దీపాలను అలంకరించి దీపారాధన చేశారు. అనంతరం రాము కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్, ఈవో కొండలరావు , మోహన్‌లు సన్మానించారు.



లక్షదీపార్చన



అధ్వానంగా బాపులపాడు పేదల కాలనీ ప్రధాన రోడ్డు

రోడ్లు జలమయం

బాపులపాడు పేదలకాలనీ సమస్యలతో సతమతం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రహదారులు అధ్వానంగా మారడంతో బాపులపాడు పేదల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 20 ఎకరాల్లో 630 ప్లాట్లతో పేదల కాలనీ ఏర్పాటు చేశారు. దారి లేక పేదలు గృహ నిర్మాణం చేపట్టకపోవడతో తాత్కాలికంగా ప్రధాన మార్గాన్ని అభివృద్ధి చేశారు. ఐదేళ్ల కిందట ఏర్పాటు చేసిన ప్రధాన రహదారిని పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. అంతర్గత రహదారులు అభివృద్ధిని అధికారులు మరిచిపోయారు. అంతర్గత రహదారుల్లో కనీసం చారెడు మట్టి కూడా పోయకుండా వదిలేశారు. కాలనీ ఏర్పాటు చేసిన గత వైసీపీ కాలనీ అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రారంభంలో ప్రధాన మార్గం మాత్రమే తాత్కాలికంగా మెరక చేసి వదిలేసింది. వర్షాకాలం కావడంతో కాలనీ ప్రజలు నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్వహించిన ప్రజావేదికలో కాలనీ వాసులు చేసిన విజ్ఞప్తి మేరకు ఆర్థిక సంఘం నిధులతో గత వేసవిలో ప్రధాన మార్గాన్ని మరమ్మతు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారి గోతులు మయంగా మారింది. కాలి నడకన కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మరింత అధ్వాన్నంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పదించి సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ముంచెత్తిన వర్షం.. మునకలో రోడ్లు



కాటూరులో అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపునీరు

ఉయ్యూరు : భారీ వర్షానికి రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై మోకాలు లోతు నీరు నిలిచింది. కాటూరురోడ్డులో హైవే అండర్ పాస్ వద్ద ఇరువైపులా సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. గండిగుంట వద్ద సర్వీస్ రోడ్డు నీటమునిగింది. రోడ్లపక్కన డ్రెయిన్ సౌకర్యం లేకపోవడంవల్ల నీరు నిలిచి పోతుంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు వరి పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి కంకులు పాలుపోసుకునే స్థితిలో ఉండగా వర్షం వల్ల తప్పలుగా మారతాయని రైతులు అంటున్నారు.



పెదఅవుటపల్లిలో మండపాక అమేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ

ఉంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం రాత్రి పెద అవుటపల్లిలో పర్యటించారు. గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఆత్మీయంగా పలుకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న టీడీపీ నాయకుడు కడియాల వెంకట్రావు, ప్రమాదవశాత్తూ కాలు విరిగిన మండపాక అమేష్ ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యపరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన కలపాల లలిత, వేగే శివయ్య, యలమంచిలి పవన్, అరిగే నాగభూషణాచారి, కుందేటి బాలస్వామి నివాసాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలుసు రవీంద్రబాబు, కుందేటి చంద్రశేఖర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

60 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థులు

ఉయ్యూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏజీ అండ్ ఎస్‌జీఎస్ డిగ్రీకళాశాల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్), రెడ్ రిబ్బన్ క్లబ్, లయన్స్‌క్లబ్ విజయవాడ రూరల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, 18 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని, ప్రతి మూడు నెలలకు ఒకసారి చేస్తే ఇబ్బంది ఉండదన్నారు. లయన్స్ క్లబ్ ట్రెజరర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతతూ రక్తదానంపై అపోహలు వద్దన్నారు. రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కె.శేఖర్‌బాబు, ఎంఎల్ఎస్ కుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్‌తేజ, ఎండి నూర్ అభినందించారు.



దేవినేని రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తదితరులు



కంకిపాడులో కేక్ కట్ చేస్తున్న రాజా, పక్కన పులి శ్రీనివాస్ తదితరులు

ఘనంగా మాజీ ఎంపీపీ దేవినేని రాజా జన్మదిన వేడుకలు

కంకిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలను సమన్వయంతో నడిపించే వ్యక్తి దేవినేని రాజాని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. వివిధ గ్రామాల్లో మాజీ ఎంపీపీ దేవినేని రాజా జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈడుపుగల్లు శ్రీనివాసపురం కాలనీలో జరిగిన దేవినేని రాజా జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర, సీనియర్ నాయకులు చెన్నుపాటి గాంధి, బొప్పన భవ కుమార్, అనుమోలు ప్రభాకర్, బొబ్బా గోపాలకృష్ణ, పందిపాటి సుధాకర్, షేక్ షకార్, అనుమోలు రామకృష్ణ, పర్వతనేని శ్రీనివాస్, రవి, మాధవ, సంగీత రావు, గరికిపాటి రవికిషోర్, లంకా రవికిషోర్, కామేశ్వరరావు, భవాని, కిలారు శ్రీను, బాహూజి తదితరులు పాల్గొన్నారు. కంకిపాడులో పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఎంపీపీ దేవినేని రాజా జన్మదిన వేడుకల్లో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకరమణ, మునిబోయిన బాబు, ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజ, రమేష్, డీఎస్ఆర్, అన్నవరపు శివపార్వతి, వడ్డాది శ్రీను, మారేష, సత్తిబాబు, బాజి, నన్నా సాహెబ్, అన్నే రామారావు, శ్యామ్, ఈడా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు, ఎస్సై సత్యనారాయణ

మోపిదేవిలో నాగులచవితికి విస్తృత ఏర్పాట్లు

మోపిదేవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25వ తేదీన నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. దేవస్థానం ఉద్యోగులు, ఎస్సై సత్యనారాయణతో కలిసి దేవస్థానంలో నాగుల చవితికి జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, రాబోయే రెండు రోజులు వర్షం కురిసినప్పటికీ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవస్థానం ఆవరణ, వెలుపల వాటర్ ప్రూఫ్ టెంట్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేసి సత్వరమే నాగపుట్ట, స్వామివారి దర్శనం కలిగించేలా చూస్తామన్నారు. క్యూ లైన్‌లో ఎక్కువ సమయం లేకుండా స్వామి దర్శనం చేసుకునేలా భక్తులు సహకరించాలన్నారు.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ విధానం

పెదపారుపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రవాణా చేయుటకు ముందస్తుగా జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుకోవాలని తహసీల్దార్ శ్రీను నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెదపారుపూడిలో సొంత వాహనాలు కలిగిన రైతులు , కిరాయికి నడుపు వాహన యజమానులు 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ రైతు సేవా కేంద్రం నుంచి కేటాయించబడిన మిల్లుకు మాత్రమే ధాన్యం రవాణా చేయుటకు గాను ముందస్తుగా జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుకోవాలన్నారు. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ డ్రైవింగ్ లైసెన్స్ యజమాని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి లేదా గ్రామ వ్యవసాయసహాయకులు వారికి అందజేసినచో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. జీపీఎస్ ట్రాకర్ నమోదు చేసుకొన్న వాహనాలు మాత్రమే మిల్లులకు ధాన్యము రవాణాకు అనుమతించనున్నామన్నారు. రైతులు, వాహన యజమానులు సత్వరమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గుడ్లవల్లేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్ పిరిస్థితుల దృష్ట్యా గుడ్లవల్లేరు ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో 6గురు కార్యదర్శులను నియమించి 24 గంటలు విధుల్లో ఉంటూ సహాయక చర్యలకు అందుబాటులో ఉంటారని ఎంపీడీవో తెలిపారు. మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా వర్షాల కారణంగా ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడిన పిరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలని ఇమ్రాన్ సూచించారు.

ప్రయాణం నరకప్రాయం

గోసాల- మద్దూరు రోడ్డు నరకానికి చిరునామాగా మారింది. ఈ రోడ్డులోకి ప్రవేశించగానే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందా..! అన్న అనుమానం వస్తుంది. 1990లో ప్రయాణ అనుభూతులను ఈ రోడ్డు కలిగిస్తుంది. ఎద్దుల బండి ఇరుసు చక్రాలు సైతం ఇరుక్కుపోయేలా ఈ రోడ్డు ఉంటుందనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. దూరం తక్కువే అయినా ప్రయాణ భారం ఎక్కువ.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ

● భారీ గుంతలతో గోసాల - మద్దూరు రోడ్డు ● నడిచేందుకు వీలు లేక అష్టకష్టాలు

కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గోసాల నుంచి మద్దూరు వెళ్లే రోడ్డు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలోని గోసాల గ్రామం నుంచి ఈ రోడ్డు ప్రారంభమవుతుంది. మద్దూరు గ్రామ ప్రజలు జాతీయ రహదారిపైకి చేరుకునేందుకు ఇదే ప్రధాన మార్గం. మద్దూరు నుంచి గోసాల గ్రామంలోని జాతీయ రహదారి వరకు 5 కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. పాఠశాలలు, కళాశాలల బస్సులు ఈ రోడ్డుపై ఎక్కువగా తిరుగుతుంటాయి. గ్రామాల్లోని రైతులు ధాన్య దిగుబడులను ఇంటికి తెచ్చుకునేందుకు ఇదొక్కటే మార్గం. రైతులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు ఇలా నిత్యం ప్రజా రవాణా ఈ రోడ్డుపై సాగుతుంటుంది. సమీప గ్రామాల్లోని జన జీవనానికి కీలకంగా ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం అధ్వాన్నంగా మారింది.







నరకానికి నకలు

ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఐదు నెలల క్రితం వరకు చిన్నచిన్న గోతులతో ఉండేది. ఈ ఏడాది ఆగస్టు నుంచి తరచూ కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డుపై గుంతలు కనుమరుగై అదే స్థానంలో అగాధాలు ఏర్పడ్డాయి. ఒక్కో ప్రదేశంలో నాలుగైదు మీటర్ల వెడల్పుతో అడుగు లోతులో ఉండే అగాధాలు ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా మారాయి. దారి పొడవునా ఈ భారీ అగాధాలు అనేకం ఉన్నాయి. మరీ ముఖ్యంగా రోడ్డు మలుపులో ఏర్పడిన భారీ అగాధం ప్రమాదాలకు కారణమవుతుంది. ఏదైనా బస్సు, కారులో ప్రయాణించాలంటే భయం వేస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. బస్సు, కారు, లారీలు రోడ్డుపై అటూ ఇటూ ఒరుగుతూ వెళుతుండటం పడిపోతుందేమోనన్న భయాందోళనకు గురి చేస్తుందని చెబుతున్నారు. ఈ రోడ్డులో కనీసం వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో రోడ్లు లేని ఓ అడవిలో ప్రయాణం చేస్తున్నట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పండుగ రద్దీని పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 06558 కలబుర్గి - బెంగుళూరు కంటోన్మెంట్ ఈనెల 24న ఒక సర్వీసు నడుస్తుంది. 06248 బరోని - ఎస్ఎంవిటి బెంగళూరు ఈనెల 26న ఒక సర్వీసు నడుస్తుంది. 06228 ముజఫర్‌పూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు ఈనెల 27న ఒక సర్వీసు నడుస్తుంది. 06552 దర్భాంగ - ఎస్ఎంవిటి బేంగళూరు ఈనెల 27న ఒక సర్వీసు నడుస్తుంది. ఇదే రైలు 06551 నెంబరుతో ఈనెల 24న బెంగళూరు నుంచి దర్భాంగ ఒక సర్వీసు నడుస్తుంది. 06184 బరోని - ఎర్నాకులం జంక్షన్ చౌక్ ఈనెల 26న ఒక సర్వీసు నడుస్తుంది. 06188 బరోని జంక్షన్ - కొడనూర్ జంక్షన్ ఈనెల 27న సోమవారం ఒక సర్వీసుగా నడుస్తుంది. 06194 బరోని - కొడనూర్ ఈనెల 28న ఒక సర్వీసు నడుస్తుంది. 06193 కొడనూర్ జంక్షన్ - బరోని జంక్షన్ ఈనెల 25న ఒక సర్వీసు నడుస్తుంది.

అర్బన్ బ్యాంకులను పటిష్టపరచాలి

● బూరగడ్డ, కొనకళ్ల ● అట్టహాసంగా మచిలీపట్నం అర్బన్ బ్యాంకు అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్ ప్రమాణ స్వీకారం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలోని అర్బన్ బ్యాంకులను డిపాజిట్ల సేకరణ ద్వారా పటిష్టపరచాలని, గృహ నిర్మాణాలకు రుణాలివ్వాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మచిలీపట్నం అర్బన్ బ్యాంకు నూతన అధ్యక్షుడిగా ఐ దిలీప్‌కుమార్ గురువారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. వర్షంలో సైతం పెద్ద ఎత్తున టీడీపీ నేతలు అర్బన్ బ్యాంకుకు తరలివచ్చారు. వేదపండితుల ఆశీర్వచనాలతో దిలీప్‌కుమార్ బ్యాంకు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బూరగడ్డ వేదవ్యాస్ సమక్షంలో దిలీప్‌కుమార్ సహా మిగిలిన డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మొదటి రోజే కోటిన్నర డిపాజిట్లు సేకరించి దిలీప్‌కుమార్ బృందం ఒక రికార్డు స్థాపించింది. అనంతరం బృందావనపుర కల్యాణ మండపంలో జరిగిన అభినందన సభలో బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ఖాతాదారులకు అందుబాటులో ఉండేలా బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ బ్యాంకులో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. బ్యాంకు నూతన అధ్యక్షుడు దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తనకు మంత్రి కొల్లు రవీంద్ర, సీఎం చంద్రబాబు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. డైరెక్టర్లు వేము కోటేశ్వరరావు, నూకల రమాదేవి, గెల్లి అరుణకుమారి, వంపుగడల చౌదరి, పోతాబత్తుల పాండురంగారావు, సూరిశెట్టి హరికృష్ణ, బొర్రా శ్రీనివాస్, గున్నం నాగరాజన్, టీడీపీ నేతలు గొర్రెపాటి గోపీచంద్, ననకా నాగులు, తూమాటి బసవయ్య, పిప్పళ్ల కాంతారావు, లోగిశెట్టి వెంకటస్వామి, టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, జనసేన నేత గడ్డం రాజు, బీజేపీ నేత పంతం గజేంద్ర పాల్గొన్నారు.



పుస్తకంలో సంతకం చేసి అర్బన్ బ్యాంకు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దిలీప్‌కుమార్ చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

వైస్‌చైర్మన్ పదవి ఇవ్వాలని చౌదరి డిమాండ్

ప్రమాణ స్వీకారం అనంతరం మాజీ కౌన్సిలర్, జనసేన నేత వంపుగడల చౌదరి తనకు వైస్‌చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని సర్దిచెప్పారు.

ఆక్వాలో ప్రపంచానికే రోల్‌మోడల్‌గా నందివాడ

రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే 8 నెలల్లో నందివాడ క్లస్టర్‌లో ఆక్వాసాగు చేసి ప్రపంచానికి రోల్ మోడల్‌గా చూపిస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి బీ రాజశేఖర్ అన్నారు. గురువారం గుడివాడ వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల ఫంక్షన్‌హాల్‌లో ఆక్వా ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ఆంధ్ర ఆక్వా రైతులకు గ్లోబల్ గుర్తింపు లక్ష్యంగా డిజిటల్ ట్రేసబిలిటీ నందివాడ ముందడుగు పేరుతో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆక్వా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు సాధికారత సాధించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆక్వాసాగులో సుస్థిరత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం పన్నుల కారణంగా రాష్ట్రంలో ఎక్కువగా ఆక్వా రంగంపై ప్రభావం చూపిందన్నారు. ముఖ్యమంత్రి ఆక్వాసాగులో సుస్థిరత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఆంధ్ర ఆక్వాసాగు దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. రాష్ట్రంలోని 5.75లక్షల ఎకరాల్లో 1800 గ్రామాల్లో ఆక్వాసాగు చేయడానికి ప్రణాళికను రూపొందించామన్నారు. నందివాడ మండలంలో 7వేల ఎకరాలకుగాను 5వేల ఎకరాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నామన్నారు. మిగిలిన రైతులు నవంబరు 15లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ చేపలుగానీ, రొయ్యలుగానీ ఆమెరికా, ఆస్ట్రేలియా, చైనా తదితర దేశాలకు వినియోగించాలంటే ఆయా దేశాల నిబంధనల మేరకు ప్రమాణాలు మేరకు ధ్రువీకరణ పత్రాలుంటేనే ఆ ఉత్పత్తులను వారు అంగీకరిస్తారని లేనిపక్షంలో తిరస్కరిస్తారన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వాసాగు చేయడం మంచి అవకాశమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వా రైతులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలుత ఆక్వా ఎక్స్ఛేంజ్ సంస్థ సహ వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వాసాగు ఎలా చేయాలో రైతులకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సహకరించిన వెల్కమ్ ఫిషరీస్ అధినేత ఆనంద్‌ను రాష్ట్ర వ్యవసాయ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఘనంగా సత్కరించారు. మత్స్యశాఖ జేడీ నాగరాజు, గుడివాడ ఆర్డీవో జీ బాలసుబ్రహ్మణ్యం, ఏపీఎస్ఏడీపీ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పలువురు ఆక్వారైతులు, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, చిత్రంలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్, కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

బ్రహ్మ లింగయ్య చెరువులో
బోటింగ్ పాయింట్!

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ● జోరువానలో గొల్లనపల్లిలో పర్యటన



గొల్లపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ

గన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మ లింగయ్య చెరువులో బోటింగ్ పాయింట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్టు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో గురువారం ఉదయం జోరు వానను సైతం లెక్కచేయకుండా వర్షంలో తడుస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.45 లక్షల ఖర్చుతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.2.40 కోట్ల ఖర్చుతో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి, రూ.24 లక్షల ఖర్చుతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ బ్రహ్మ లింగయ్య చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ బోటింగ్ పాయింట్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించగా, సానుకులంగా స్పందించిన ప్రభుత్వం ఫీజిబిలిటీ సర్వే జరుపుతున్నట్టు వివాదాలకతీతంగా ప్రజల ఆమోదంతో పలుచోట్ల రోడ్ల విస్తరణ చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో కొండలు, గుట్టలు, చెరువుల్లో మట్టి దోచుకుంటూ 8ఏళ్లుగా అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రశ్న లేదని హెచ్చరించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలందరి సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెడతానన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామంటూ ఇద్దరు మహిళలు యార్లగడ్డకు మొరపెట్టుకోగా వెంటనే స్పందించిన ఆయన రూ.5 లక్షల ఖర్చుతో సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులు ఆదేశించారు. సర్పంచ్ గణపవరపు శాంతి, టీడీపీ మండలాధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసయ్య, మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, దొంతు చిన్న, కొండేటి వెంకటేశ్వరరావు, గుజ్జర్లపూడి బాబురావు, యనమదల సతీష్, చిమటా రవి వర్మ ఎంపీడీవో స్వర్ణలత పాల్గొన్నారు. తెలుగుదేశం నేతలు ట్రాక్టర్ల ర్యాలీతో యార్లగడ్డకు స్వాగతం పలికారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఘనంగా ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు





విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఆర్డీవో చైతన్య

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అద్భుత ప్రదర్శనలు, ఆకట్టుకునే నృత్యాలు, యువత కేరింతల మధ్య ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. యువజన సర్వీసుల శాఖ, సెట్ప్, క్రిషి ఆధ్వర్యంలో కొత్తపేట కేబీఎన్ కళాశాలలో గురువారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలకు విజయవాడ ఆర్డీవో కే చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి యువజనోత్సవాలు మంచి వేదికన్నారు. జిల్లా యువత రాష్ట్ర, జాతీయ పోటీల్లో బహుమతులు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన సంక్షేమాధికారి, ముఖ్య కార్యనిర్వహణాధికారి యూ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన వారికి, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రతి ఏటా జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల విద్యార్థులు బృందగానం, నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీపడ్డారు. అద్భుత ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. అబ్బురపరిచే ప్రదర్శనలను చూసి యువత కేరింతలు కొట్టారు. జానపద గీతాల విభాగంలో ఎం సింధు రాజేశ్వరి బృందం మొదటి స్థానంలో నిలవగా, టీ కిరణ్ బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. జానపద నృత్యం విభాగంలో విఘ్నేష్ కార్తికేయ బృందం మొదటి బహుమతిని, కౌశిక్ బృందం రెండో బహుమతిని దక్కించుకున్నాయి. సైన్స్ మేళలో కే అఖిల బృందం తొలి స్థానంలో, సీహెచ్ హాసిని బృందం ద్వితీయ స్థానంలో నిలిచాయి. స్టోరీ రైటింగ్‌లో కే బాల మణిప్రసాద్ ప్రథమ బహుమతిని, కే ప్రదీప్ కుమార్ ద్వితీయ బహుమతిని పొందారు. పోయెట్రీలో ఎం శ్రీలేఖ, వీ వర్షిణి మొదటి, రెండు స్థానాలు పొందగా, చిత్రలేఖనంలో డీ సుదీక్ష, ఎం శ్రీ వైష్ణవి, డిక్లమేషన్లో కే శ్రావణి, ఎస్కే నదియా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. విజేతలకు విజయవాడ ఆర్డీవో కే చైతన్య, షైభారత్, యూత్ ఆఫీసర్ సుంకర రాము మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సెట్ప్ క్రిషి మేనేజర్ డీ సుబ్బారావు, యువజన సర్వీసుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ అభిజ్ఞాన్, సిబ్బంది, కళాశాల కమిటీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కెంపే గౌడ విమానాశ్రయాన్ని సందర్శించిన ఏడీసీ బృందం

కెంపేగౌడ విమానాశ్రయంలో ఏడీసీ బృందం

కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కెంపే గౌడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి, ఉద్యానవనం విభాగం అధికారులు గురువారం సందర్శించారు. అక్కడ విమానాశ్రయంలో అత్యంత శోభాయమానంగా అభివృద్ధి చేస్తున్న పచ్చదనాన్ని పరిశీలించారు. విమానాశ్రయ అధికారులు ఏడీసీ ప్రతినిధులకు గ్రీనరీ అభివృద్ధికి వారు అవలంబిస్తున్న పద్ధతులను క్షేత్రస్థాయిలో వివరించారు. విమానాశ్రయ పరిసరాల్లో పచ్చదనం అభివృద్ధి మొత్తం డ్రిప్ ఆటో మిషన్ ద్వారా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ముఖ్యంగా పూలచెట్లు, మొక్కలు, నీటికుంటలు, వాటర్‌ఫౌంటైన్లు, కారిడార్ల వద్ద గ్రీనరీ అభివృద్ధికి మైక్రో ఇరిగేషన్ వ్యవస్థను ఉపయోగించడం ద్వారా పచ్చదనం పెంచడం సులువుగా ఉండటంతో పాటు అద్భుతమైన లక్ష్యాలను సాధిస్తున్నట్టు ఎయిర్‌పోర్ట్ ప్రతినిధులు ఏడీసీ బృందానికి వివరించారు. ప్రజా రాజధాని అమరావతిలో గ్రీనరీ అభివృద్ధికి తాము కూడా అత్యధిక పద్ధతులతో ముందుకు వెళ్తున్నామని సీఎండీ లక్ష్మీ పార్థసారథి, విమానాశ్రయ ప్రతినిధులకు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని సందర్శించాలని వారికి ఆహ్వానం పలికారు. ఈ పర్యటనలో ఏడీసీ ఉద్యానవనం విభాగం అధికారులు, నిపుణులు పాల్గొన్నారు.



వేతన కార్యదర్శులకు బోనస్ పంపిణీ చేస్తున్న చలసాని

నాణ్యమైన పాల సేకరణపై దృష్టి పెట్టాలి

● విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన పాల సేకరణపై సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు మరింత దృష్టి పెట్టి పాల దిగుబడి పెంచడానికి మరింత కృషి చేయాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం వీరవల్లి కామధేను యూనిట్‌లో హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం యూనిట్ పరిధిలోని వేతన కార్యదర్శులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పాలసేకరణ ఆధారిత బోనస్ సొమ్ము రూ.18.19లక్షలు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా రూ1.24 కోట్ల బోనస్ అందజేసినట్టు ఆయన తెలిపారు. నాణ్యమైన పాలసేకరణ పెరిగితే సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. అధిక పాలసేకరణ చేసిన సంఘాలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వేతన కార్యదర్శులు చలసానిని శాలువతో సత్కరించారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ప్రొక్యూర్‌మెంట్ జీఎం పారీ, వివిధ సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, క్షేత్రస్థాయి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



క్యామెట్ యాప్‌పై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గ్రామస్థులు

గ్రామంలో క్యామెట్ కల్లోలం

● యాప్‌కు బానిసలవుతున్న యువత

● పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ గ్రామంలో క్యామెట్ యాప్ కొంతకాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్నట్టు గ్రామానికి చెందిన కొందరు జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లును ఆశ్రయించిన ఘటన గురువారం సంచలనం కలిగించింది. ఈ యాప్‌లో మహిళలు అర్ధనగ్నంగా సభ్యసమాజం సిగ్గుపడేలా వీడియోలు, ఫొటోలు పెడుతూ వెకిలి చేష్టలతో పోస్టులు చేస్తుండటంతో యువత, మహిళలు ఆకర్షితులై విద్యార్థులు పాఠశాలలకు, మహిళలు వ్యవసాయ పనులకు గైర్హాజరవటంతో పాటు బానిసలుగా మారుతున్నారు. అక్రమ సంపాదనకు కొందరు స్వార్థపరులు యాప్ లింకును పంపుతున్నట్టు గుర్తించామని తక్షణ చర్యలు తీసుకోకుంటే గ్రామ పరిస్థితి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం నుంచే తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన మహిళల ద్వారా క్యామెట్ లింకు వెళ్లిందని గ్రామంలోని స్థానికులు గమనించి అప్రమత్తమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లటంతో మొగ్గలోనే తుంచారని ఇక్కడ కూడా అలాగే చేయాలని సీఐని కోరారు. సీఐ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇస్తామని, యాప్‌ను తొలగించేందుకు జిల్లా సైబర్ టీంతో చర్చలు జరుపుతున్నామని ఆందోళన వద్దన్నారు. ఎస్ఐను కలిసిన వారిలో బాల్యానాయక్, గుగులోతు బగ్గీషా, గుగులోతు రాంబాబు ఉన్నారు.

కిలేడీ వ్యాపారి

● కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయం

● విజిలెన్స్ సోదాలతో బయటపడిన వ్యవహారం

ఆంధ్రజ్యోతి - విజయవాడ: చిన్నారులు ఇష్టపడే బాదం పొడి.. కేక్‌లు.. చాక్లెట్లు.. బిస్కట్లు.. వంటి ఆహార పదార్థాలను కాలం చెల్లిపోయినా విక్రయించేసి సొమ్ములు చేసుకుంటోంది ఓ మహిళ. రాజకీయంగా, గ్యాంగ్‌ల పరంగా తనకున్న సంబంధాలను అడ్డుపెట్టుకుని చెలరేగిపోతుంది. విజయవాడ వన్‌టౌన్‌లో ఉంటూ భవానీపురంలోని ఫుడ్ ప్రొడక్ట్సను నిర్వహిస్తున్న వ్యవహారం విజిలెన్స్ సోదాలతో వెలుగులోకి వచ్చాయి. వన్‌టౌన్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ ఫుడ్ ప్రొడక్ట్సను భవానీపురం కేంద్రంగా ఏర్పాటు చేశాడు. తర్వాత ఆయన సతీమణి మరోవ్యక్తితో కలిసి అతడిని హత్య చేసి ప్రతి వ్యాపారాన్ని తన చేతుల్లో పెట్టుకుని నడిపిస్తోంది. ప్రస్తుతం ఫుడ్ ప్రొడక్ట్సను ఆమె నడిపిస్తోంది.

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు

సాధారణంగా ప్రతి వ్యాపారానికి ఒక లైసెన్స్ ఉంటుంది. ముఖ్యంగా ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించి ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ ఉంటుంది. దీనికి కొంత గడువు ఉంటుంది. అది ముగిశాక రెన్యువల్ చేయించుకోవాలి. కానీ ఈ మహిళ రెన్యువల్ చేయించుకోకుండా యథేచ్ఛగా వ్యాపారం చేస్తోంది. ప్రశ్నించిన అధికారులపై రాజకీయ నేతలను, న్యాయవాదులను వదులుతోంది. లైసెన్స్ ఏ కేటగిరిలో తీసుకుంటే దాని ప్రకారమే వ్యాపారం చేయాలి. కానీ ఆమె ఉల్లంఘించి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో బాదం టీపొడి, పాల పొడి, బిస్కట్లు, చాక్లెట్లతోపాటు జామ్‌లను ఎలాంటి నిపుణుల పర్యవేక్షణ లేకుండా తయారు చేయడం గమనార్హం. ఈ మహిళకు తెలంగాణలోని గ్యాంగ్‌స్టర్ అనుచరులతో సంబంధాలున్నాయని ఆరోపణలున్నాయి. ఈ సంస్థపై విజిలెన్స్ ఫుడ్ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేయడం గమనార్హం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

కొండాలమ్మ ఆలయంలో లక్ష దీపార్చన

గుడ్లవల్లేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా బుధవారం రాత్రి వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో లక్షదీపార్చన కన్నులపండుగగా నిర్వహించారు. గుడివాడకు చెందిన భక్తులు ఇంటి రాము వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో లక్ష దీపార్చన నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి అకుల కొండలరావు తెలిపారు. శంఖు, చక్ర నామాల ఆకృతుల్లో, ఓంకారం, స్వస్తిక్, త్రిసూలం, ఆకృత్లుల్లో దీపాలను అలంకరించి దీపారాధన చేశారు. అనంతరం రాము కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్, ఈవో కొండలరావు , మోహన్‌లు సన్మానించారు.



కొండాలమ్మ ఆలయంలో లక్ష దీపార్చన చేసిన భక్తులు

కురుమద్దాలిలో జాబ్‌మేళా 29న

పామర్రు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 29న కురుమద్దాలిలో గల స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు గురువారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. ఈమేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుత 10తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఎంపికైన వారికి రూ.8000 నుంచి రూ.20,000 వరకు జీతాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ విధానం

పెదపారుపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రవాణా చేయుటకు ముందస్తుగా జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుకోవాలని తహసీల్దార్ శ్రీను నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెదపారుపూడిలో సొంత వాహనాలు కలిగిన రైతులు , కిరాయికి నడుపు వాహన యజమానులు 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ రైతు సేవా కేంద్రం నుంచి కేటాయించబడిన మిల్లుకు మాత్రమే ధాన్యం రవాణా చేయుటకు గాను ముందస్తుగా జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుకోవాలన్నారు. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ డ్రైవింగ్ లైసెన్స్ యజమాని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి లేదా గ్రామ వ్యవసాయసహాయకులు వారికి అందజేసినచో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. జీపీఎస్ ట్రాకర్ నమోదు చేసుకొన్న వాహనాలు మాత్రమే మిల్లులకు ధాన్యము రవాణాకు అనుమతించనున్నామన్నారు. రైతులు, వాహన యజమానులు సత్వరమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగవరంలో నివాసముంటున్న బండారు స్వప్న 20వ తేదీ రాత్రి తన భర్త (భర్త శ్రీనివాసరావు)తో గొడవపడింది. తన భర్త కొట్టాడని తన నాలుగు సంవత్సరాల కుమారుడు యాష్ కుమార్‌ను తీసుకుని 21వ తేదీ సాయంత్రం సుమారు 3.30 గంటలకు ఇంటిని నుంచి వెళ్లిపోయింది. ఆ సమయంలో భర్త లేడు. సమీప బంధువులు, చుట్టాల దగ్గర అడిగినప్పటికీ ఆచూకీ తెలియకపోవటంతో భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

పామర్రు: కోమరవోలుకు చెందిన ఓ వివాహిత మహిళ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదేగ్రామానికి చెందిన మేడపాటి కార్తీక్(22) అనే యువకుడు ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాని పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీఎస్సై సత్యకళ గురువారం విలేకరులకు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పామర్రు : పెదమద్దాలిలో వేంచేసియున్న ఉద్ధండ వేణుగోపాలస్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన త్రిపురనేని వెంకటపరమేశ్వరరావు, రమాదేవి దంపతులు గురువారం రూ.2,16,000ల నగదు బ్యాంకు చెక్కును ఆలయ అధికారి జన్ను వేంకటేశ్వరరావుకు అందించినట్లు తెలిపారు. నూతన ఆలయ నిర్మాణం కోసం భక్తులు మరింత ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత సమరం

ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి

గుడివాడ : మద్యం సేవించి, నిర్లక్ష్యంగా పాఠశాల బస్సును నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం సేవించిన డ్రైవర్‌కు చిన్నారులను అప్పగించి ప్రయివేటు విద్యాసంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. చిన్నారులకు ఏమైన జరిగి ఉంటే ఎవరూ బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలన్నీ బస్సుడ్రైవర్‌లకు ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని, డ్రైవర్‌ల శారీరక, మానసిక, ఆరోగ్యం, డ్రైవింగ్ చేయగల సామర్థ్యంపై ఎప్పటికప్పుడు పాఠశాల యాజమాన్యాల పర్యవేక్షణ ఉండాలన్నారు. సంఘటనకు కారణమైన బస్సు డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని సమరం డిమాండ్ చేశారు.

భారీ వర్షం .. రోడ్లు ఛిద్రం

అల్పపీడన ప్రభావం కారణంగా గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయంగా మారి చెరువును తలపిస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. రహదారులు కనిపించనంతగా వర్షం కురవటంతో పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. గుంతలు పడి అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది.



బంటుమిల్లి రోడ్డులోని పెద్ద శివాలయం వద్ద..

గుడివాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుడివాడ పట్టణం నీటమునిగింది. పట్టణ శివారు ప్రాంతాలు, కాలనీలో రహదారులన్నీ జలమయ్యాయి. అంతర్గత డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రహదారులపైకి చేరి దుర్వాసన వెదజల్లాయి. బస్టాండ్ వద్ద, మార్కెట్ వద్ద, పెద్దశివాలయం వద్ద, ఏలూరురోడ్డులోని కార్ల స్టాండ్, కోర్టు భవనాల సముదాయం వద్ద ప్రధాన రహదారుల్లో వర్షపునీరు పారుదల లేక ప్రయాణీకులు ఇక్కట్లకు గురయ్యారు. గుడివాడ-వెంట్రప్రగడ మధ్య రహదారిలోని గుంతల్లో నీరు చేరడంతో, కొత్త బైపాస్‌లోని గుంతల్లో వర్షపునీరు నిల్వతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. ఆకస్మికంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించడంతో భారీ వర్షం నేపథ్యంలో ఇళ్లకు చేరేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

గుడివాడ రూరల్: భారీ వర్షంతో గుడివాడ రూరల్ మండలంలో పలు రహదారులు జలమయంగా మారాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం భారీ వర్షం కురవటంతో జనజీవనం స్తంభించిపోయింది. పూర్తిగా బయటకు



పెదపూడిలో జలమయంగా మారిన రహదారి

వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలకు సెలవు ఇవ్వటంతో విద్యార్థులు ఇంటి వద్దే ఉన్నారు. గ్రామంలో రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షం కురవటంతో గుంటాకోడూరు, గోల్వేపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి.

కూచిపూడి : కూచిపూడి బస్టాండ్ ప్రాంతం, పెదపూడి ప్రధాన రహదారి, కూచిపూడి, చల్లపల్లి రహదారులు నీట మునిగాయి. మొవ్వ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న రహదారి గుంతలమయంగా మారింది. దీంతో గోతుల్లో వర్షపునీటితో నిండి మరింత ప్రమాదకరంగా తయారయింది.

పామర్రు : పామర్రు-చల్లపల్లి ప్రధాన రహదారిపై నాగులేటి వంతెన ఎగువప్రాంతమైన సుభద్ర కల్యాణమండిరం సమీపంలో పంచాయతీ మురుగు డ్రెయినేజీ ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు కొంత అవరోధంగా మారింది. సమాచారం అందుకున్న పంచాయతీ అధికారి అబ్దుల్ సలీం శానిటరి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తన సిబ్బందిని అప్రమత్తుల్ని చేశారు. గ్రామంలో ఎక్కడ ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని సలీం ఆదేశించారు. ఈ నేపథ్యంలో చల్లపల్లి రహదారి డ్రెయినేజీ లైన్లుకు ఉన్న అడ్డంకులను తొలగించడంతోపాటుగా మురుగు సరఫరాను పునరుద్ధరించడంతో వాహనాల రాకపోకలు ఉన్న అవరోధం తీరింది. విజయవాడ-మచిలీపట్నం ప్రధాన జాతీయ రహదారిలోని బస్టాండ్ సమీపంలో మురుగు డ్రెయినేజీలు పొంగి పొర్లీ రహదారిపై ప్రవహించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. అధిక వర్షానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, పోలీసుస్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. యాదవపురం కాలనీల్లో నీరు ఇండ్లలోకి చేరుకోవడంతో యుద్ధప్రతిపాదికన పంచాయతీ శానిటరి మేస్త్రీ శివనాగు పర్యవేక్షణలో డ్రెయినేజీలోగల అవరోధాలను తొలగింపజేయడంతో ప్రజ ల అవస్థలను తీర్చారు. గుడివాడ రోడ్డులోని పెదమద్దాలి ఫ్లైఓవర్ బ్రిడ్జితోపాటుగా కురుమద్దాలి ఫ్లైఓవర్ వంతెన కింద భారీ స్థాయిలో వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పామర్రు-చల్లపల్లి ప్రధాన రహదారి..



గుడ్లవల్లేరు కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గుడ్లవల్లేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, ప్లాష్ ఫ్లడ్ పిరిస్థితుల దృష్ట్యా గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో తక్షణ చర్యల నిమిత్తం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో 6గురు గ్రామ పంచాయతీ సెక్రటరీలను నియమించి 24 గంటలు విధుల్లో ఉంటూ సహాయక చర్యలకు అందుబాటులో ఉంటారని ఎంపీడీవో తెలిపారు. మండల పరిధిలోని ఏగ్రామంలోనైనా వర్షాల కారణంగా ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడిన పిరిస్థితుల్లో గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలని ఇమ్రాన్ విజ్ఞప్తిచేశారు.

గుడివాడ : భారీ వర్షాల నేపథ్యంలో గుడివాడ పురపాలక సంఘం పరిధిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు శానిటేషన్, వర్షపు నీరు నిల్వ, వీధి దీపాల సమస్యలు, పురపాలక సంఘానికి సంబంధించిన ఇతర సమస్యలు ఏమైన ఉంటే పురపాలక సంఘం హెల్ప్‌లైన్ నెం.87126 24774కు ఫోన్ ద్వారా గానీ, వాట్సాప్ ద్వారా(ఫోటోస్, లోకేషన్)తో సమాచారం పురపాలక సంఘం సిబ్బందికి తెలపాలని కమిషనర్ మనోహర్ పేర్కొన్నారు.



గుడివాడ-వెంట్రప్రగడ రహదారిలో....

పెదపారుపూడి : పెదపారుపూడి నుంచి పునాదిపాడు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గోతులమయంగా మారింది. ఈ రోడ్డు వెంబడి గ్రామాలైన జువ్వనపూడి, అప్పికట్ల, ముదునూరు, కాటూరు వెళ్లే రహదారిపై గోతులు అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని లేదా గోతులను పూడ్చాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

నందివాడ: గోపాలపురం నుంచి పోలుకొండ మీదుగా గుడివాడ వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించక తప్పడం లేదు. ఈ రహదారిపై ఏర్పడ్డ గోతులతో నిత్యం వాహనదారులు సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తోంది. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులపై ఏర్పడ్డ గోతులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో నిత్యం వాహనదారులు రోడ్డు ప్రమాదాల



గుడ్లవల్లేరులోని కొత్తకాలనీలో జలమయమైన రోడ్డు

భారీన పడక తప్పడం లేదు. గోతుల్లో నిలిచిన వర్షం నీటిలో ఏది రహదారో.. ఏది రోడ్డో తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అధ్వాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపిలేని వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8 గంటలవరకూ 46.8 మిల్లీమీటర్లు, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అంతర్గత రహదారుల్లో నీరు నిలవడంతో పంచాయతీ సిబ్బంది నీటిని డ్రెయిన్లలోకి మళ్లించి రోడ్లు ముంపు బారిన పడకుండా చూశారు.



పోలుకొండ - గుడివాడ ఆర్అండ్‌బీ రోడ్డు



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కూటమి నాయకులు

పేదవర్గాల సంక్షేమమే కూటమి ధ్యేయం

గుడివాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదవర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ(నాని) పేర్కొన్నారు. స్థానిక ప్రజావేదికలో నియోజకవర్గ పరిధిలోని 15మంది బాధిత కుటుంబాలకు రూ.10లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో రికార్డుస్థాయిలో సుమారు రూ.4కోట్లు చెక్కులను నేటి వరకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు చేకూరు జగన్మోహనరావు, వాసే మురళీ, గోకవరపు సునీల్, పెద్దు వీరభద్రరావు, వీరమాచినేని శైలజ, మధుసూదనరావు, రాము, సత్తిబాబు, రమేష్, ఆంజనేయులు, అడపా బాబీ, గరికిపాటి రాంబాబు, రోహిణి కుమార్, కాగిత శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పామర్రు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తుల్ని చేసే బాధ్యత సంబంధిత ఉద్యోగులు తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ కోరారు. ఎంపీపీ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.4కోట్లతో అన్నిగ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. సంబంధిత గ్రామాల్లో నిర్వహించేబోయే రహదారుల నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులను సభ దృష్టికి తీసుకొచ్చారు. అంటువ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకతను వైద్యఅధికార సిబ్బంది తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే 15 ఆర్థిక సంఘనిధులకు సంబంధించి చేపట్టే అభివృద్ధి పనుల నివేదకలను సిద్ధం చేయాలని కోరారు. తొలుత వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.జ్యోతి, ఎంపీడీవో కార్యాలయ ఏవో టి.మారుతిరావు, డిప్యూటీ తహసీల్దార్ గోపాల్ వ్యవసాయశాఖ అధికారి వి.శివనాగరాణి, పీఆర్ఏఈ రామారావు, ఎంఈవో గుమ్మడి పద్మవాణి తదితర అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు , ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయ పునఃప్రతిష్ఠకు ఏర్పాట్లు

● వల్లభనేని వెంకట్రావు

గుడ్లవల్లేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో వేంచేసియున్న రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ గోపురం జీర్ణోద్ధరణ, ఆలయ ఆధునీకరణ పనులు ముగించుకొని నవంబరు 1వ తేదీ శనివారం శిఖర పునఃప్రతిష్ఠ నిర్వహించనున్నామని నిర్వాహక కమిటీ సభ్యుడు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. 78 సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయం గోపుర జీర్ణోద్ధరణ, ఆలయ అభివృద్ధి పనులను దాదాపు రూ.75 లక్షల వ్యయంతో ఎంతో అద్భుతంగా ఆధునీకరించారు. ఈనెల 30,31,నవంబరు 1 వతేదీ మూడురోజుల పాటు ఆలయ జీర్ణోద్ధరణ పూర్వక శిఖర ప్రతిష్ఠా సంప్రోక్షణ మహోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. అక్టోబరు 3తేదీ సాయంత్రం 6.31 లకు గోపూజ, ప్రార్థనా సుక్త పఠనము, విస్వక్సేన పూజ, రక్షాబంధనం, దీక్షా స్వీకరణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 31 తేదీ శుక్రవారం అగ్ని మధన, అగ్నిప్రతిష్ఠాపన, శిఖర అక్షిన్మోచన, వాస్తుపూజ, వాస్తు హోమం, మూలమంత్రహవనము, స్వామి శిఖర, యంత్రములకు చతుర్థశ కలశ స్నపన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. నవంబరు 1 శనివారం ఉదయం 10.56 లకు శిఖర ప్రతిష్ఠ, అనంతరం సంప్రోక్షణ, ధాన్యధేను దర్శనము, శాంతికల్యాణము సత్యదేవుని దర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నామని నిర్వాహకులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో కొసరాజు బాపయ్యచౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, యలమంచిలి రామకోటేశ్వరరావు, వల్లభనేని బాపయ్యచౌదరి, పోలవరపు వెంకటరావు, పొట్లూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో ఆలయ పునఃప్రతిష్ఠకు సిద్ధమైన రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం

అప్పు విషయంలో అత్తాకోడళ్లపై దాడి

గుడివాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక ద్రోణాదుల వారి వీధికి చెందిన అబ్దుల్ బషీరున్నీసా అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ మెహరున్నీసా వద్ద కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకుంది. ఈ అప్పు విషయమై ఈ నెల 18వతేదీన అబ్దుల్ మెహరున్నీసా, బషీరున్నీసా అత్త జానుల మధ్య వివాదం రాజుకుంది. తన కోడలు అప్పును తీర్చేసిన మళ్లీ అడగటం పట్ల ఆమె ఆక్షేపణ తెలిపారు. దీంతో మోహరున్నీసా, ఆమె భర్త రఫీ, కుమారులు రహీం, మోబీన్‌లు బషీరున్నీసా, అత్త అబ్దుల్ జానుపై దాడి చేసి గాయపరిచారు. గాయాలపాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై లోవరాజు తెలిపారు.

మురుగునీరు తాగేదెలా..!

● కుళాయి నుంచి వస్తున్న కలుషిత నీరు
● విడతలవారీగా తాగునీరు విడుదల
● ప్రజలకు తప్పని తిప్పలు

(కూచిపూడి - ఆంధ్రజ్యోతి): నిడుమోలు గ్రామాలకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు. ఐలూరు నుంచి వచ్చే కృష్ణావాటర్‌తోపాటు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి వచ్చే తాగునీరు మురికిగా వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ కెపాసిటీ చాలకపోవటంతో గ్రామంలో విడతలవారీగా నీరు వదులుతున్నారు. పేరు గొప్ప - ఊరు దిబ్బ అన్న చందంగా ఒకప్పుడు నిడుమోలు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. ఇప్పుడు ఆ గ్రామంలో కనీస వసతులు లేకపోవటంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. హైస్కూల్ రోడ్డు, చర్చి రోడ్డులో కొన్ని కుళాయిలు పని చేయకపోవటంతో బజారు చివరి గృహాలకు చెందిన వారు సైతం పని చేసే కుళాయిల వద్దకు వచ్చి వాటర్ పట్టుకుంటున్నారు. దీంతో అందరూ ఒకేసారి తాగునీటి కోసం కుళాయిల వద్దకు రావడంతో రద్దీ ఏర్పడుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. మురికి నీరు రాకుండా చర్యలు చేపట్టడంతోపాటు సకాలంలో అందరికీ సరిపడినంతగా వాటర్ విడుదల చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కలుషిత నీరు రాకుండా చర్యలు చేపడతాం

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఐలూరు నుంచి వచ్చే కృష్ణా వాటర్ మురికిగా వస్తున్నాయి. గ్రామం మొత్తం ఒకే ఓవర్ హెడ్ ట్యాంక్ ఉండటం వల్ల దశలవారీగా నీరు విడుదల చేస్తున్నాం. మురికి నీరు రాకుండా చర్యలు చేపడతాము. మరో వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

వీరహనుమాన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి



చర్చి రోడ్డులో గుంతలో నిలబడి నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



పెడన ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అనంతలక్ష్మి ప్రమాణ స్వీకారం నేడు

పెడన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా భీముని అనంతలక్ష్మి శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారని జనసేన పార్టీ నాయకుడు విక్రుతి శ్రీనివాస్ తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

వడ్డెరపాలెంలో విద్యుదాఘాతంతో మృతి

కోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వడ్డెరపాలెంలో సానందుల నాంచారయ్య (60) బుధవారం పూరిపాకలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుని కుమార్తె తన్నీరు మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.



బందరులోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రధాన రోడ్డులో వర్షపు నీరు



పెదతుమ్మిడిలో డ్రెయిన్లను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



ఘంటసాల జ్ఞానోదయ కాలనీలో వర్షపు నీరు

భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

● పల్లపు ప్రాంతాలు జలమయం ● రోడ్లు అధ్వానం ● ప్రజల తీవ్ర ఇబ్బందులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షంతో మచిలీపట్నం జలదిగ్బంధంలో ఉండిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైన్లు, రోడ్లు ఏకమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, కోనేరుసెంటర్, లక్ష్మీటాకీసు సెంటర్, రేవతీ సెంటర్లు ముంపునకు గురయ్యాయి. బస్టాండ్‌లోకి ప్రయాణీకులు వెళ్లేందుకు అవస్థలకు గురయ్యారు. రోడ్లపై మోకాలి లోతు నీరు చేరడంతో మోటారు వాహనాల సైలెన్సర్లలోకి నీళ్లు వెళ్లి వాహన చోదకులు అవస్థలకు గురయ్యారు. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. చాలా వరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు తెరచుకోలేదు. పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. 11వ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నీటమునిగాయి. ఏరోజు కారోజు నిత్యావసర వస్తువులు కొనుక్కునే పేదలు అవస్థలకు గురయ్యారు. ఆదర్శనగర్, పీకేఎం కాలనీ, పుచ్చలపల్లి సుందరయ్యనగర్, కరెంటు కాలనీ, రామలింగేశ్వర స్వామి దేవాలయం ముంపునకు గురయ్యాయి. 11వ డివిజన్‌లో ముంపునకు గురయిన లో తట్టు ప్రాంతాలను టీడీపీ నాయకుడు చిన్నం శివ సందర్శించారు. ఇంజనీరింగ్, నగర పాలక సంస్థ అధికారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. **పెడన** : అల్పపీడన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పెడన పట్టణం తడిసి ముద్దయింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై నీరు నిలిచింది. కలంకారీ పనులకు ఆటంకం కలిగి కార్మికులు ఖాళీగా ఉంటున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పట్టణంలో పర్యటించి వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. **బంటుమిల్లి** : భారీ వర్షాల కారణంగా రోడ్లు, అంతర్గత రోడ్లు, పంటపొలాలు, నీట మునిగాయి. పంట చేతికి వస్తున్న సమయంలో వర్షాలు కురవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల వరి నేలకు ఒరిగింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లు జలమయమౌతున్నాయి. గత ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయకపోవడం వల్ల పంటపొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ గురువారం పర్యటించారు. ఆముదాలపల్లి, పెదతుమ్మిడి గ్రామాల డ్రెయిన్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల రైతులతో మాట్లాడారు. పెదతుమ్మిడి డ్రెయిన్‌లో, కిక్కిస, తూడు, గుర్రపుడెక్క కాడతో నిండిపోవడం వల్ల పంటపొలాలు ముంపుకు గురి అవుతున్నాయని రైతులు తెలియజేయగా, యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, దూసనపూడి సుబ్బయ్య, బొల్లా రవి, బొల్లా శ్రీను, చిన తుమ్మిడి, పెదతుమ్మిడి, ఆముదాలపల్లి, మలపరాజుగూడెం రైతులు పాల్గొన్నారు. **గూడూరు** : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తరకటూరు గ్రామంలోని రోడ్లు కాలువను తలపిస్తోంది. ఈ రోడ్డు మీదుగా పద్దారాయుడుతోట, కాజ తదితర గ్రామాలకు వెళ్తుంటారు. రోడ్డు గోతులమయంగా మారడంతో వాహనదారులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. చిన్నపాటి గోతులు పెద్ద గోతులుగా మారి పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. **చల్లపల్లి** : రెండు రోజులుగా వర్షాలు కురవటంతో పల్లపు ప్రాంతాలు జల మయమయ్యాయి. రహదారులపై నీరుచేరింది. చల్లపల్లిలో 40.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రధాన రహదారులపై నీరు నిలిచి వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. గత ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహించిన కాలనీలో రహదారుల నిర్మాణం జరగకపోవటంతో నీరునిలిచిపోయింది. పంచాయతీ అధికారులుముంపు ప్రాంతాల్లో నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. మరోవైపు మురుగుకాల్వలు నిండుకుండలా ప్ర వహిస్తున్నాయి. **ఘంటసాల** : పలు కాలనీల్లో నీరు చేరింది. భారీ వర్షం కురవటంతో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో పలు పల్లపు ప్రాంతాలు, కాలనీలు ముంపబారిన పడ్డాయి. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఘంటసాలలోని ఘోటకం ఏ, బి కాలనీ, జ్ఞానోదయ కాలనీ, క్రిస్టియన్, వెనిగళ్ల బజార్‌లో రెండు అడుగుల మేర నీరు నిలిచి ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రహదారులు సైతం చెరువులుగా మారటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఘోటకం ఏ కాలనీలోని పల్లపు ప్రాంతంలో గృహాలు నీటముంపునకు గురయ్యాయి. ఇంటిలోకి చేరిన నీటిని బయటికి తరలించేందుకు గృహ యజమానులు నానా అవస్థలు పడుతున్నారు. ఎంపీడీవో సుబ్బారావు ఆదేశాలతో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో నీటిని బయటకు మళ్లించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. **మోపిదేవి** : ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయంగా మారాయి. మోపిదేవి, వెంకటాపురం, కొక్కిలిగడ్డ గ్రామాల్లోని కాలనీలు, అంతర్గత రహదారులు మోకాలి లోతు నీటితో నిండి జలాశయాలను తలపిస్తున్నాయి. వర్షాలు, ఈదురుగాలులకు వెంకటాపురం, పెదప్రోలు, కొక్కిలిగడ్డ గ్రామాల్లో వరి నేలకొరిగింది. ధాన్యం పాలు పోసుకునే దశలో వర్షాలు కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. **నాగాయలంక** : మండలంలో 76.8 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ వర్షానికి డ్రయిన్ పొంగిపోయి ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు వర్షం నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షం నీరు చేరటంతో గృహస్థులకు ఇబ్బందిగా మారింది. చిరు వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. **కోడూరు** : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు నేలకొరగటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. కోడూరు మండలం లింగారెడ్డిపాలెం, నరసింహాపురం, నక్కవాని దారి, ఐబీ పేట, జయపురం, కృష్ణాపురం గ్రామాల్లో ఈత దశలోనే పంట నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఇలానే కొనసాగితే పంట దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు.

అవనిగడ్డ రూరల్ : తుంగలవారిపాలెం ఎన్టీఆర్ కాలనీలో భారీ ఎత్తున వర్షపు నీరు చేరటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రహదారులు మరింత అధ్వానంగా ఉన్నాయి. ఏ రహదారి చూసినా వర్షపు నీరు నిలిచిపోయింది. గ్రామానికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. అశ్వారావుపాలెంలోని రహదారులు అధ్వానంగా తయారయ్యాఇ. చేరుకున్నాయి. వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అశ్వారావుపాలెం - మోదుమూడి మధ్య లింక్ రోడ్డుపై సైతం వర్షపు నీరు నిలిచింది. రెండు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలుకోరుతున్నారు.



నాగాయలంక ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరు



డివిజన్‌లో పర్యటిస్తున్న చిన్నం శివ



తుంగలవారిపాలెం ఎన్టీఆర్ కాలనీలో వర్షపు నీరు



చల్లపల్లి కొత్త కాలనీలో వర్షపునీరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మండలి

అవనిగడ్డ : భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. నియోజకవర్గంలో ముంపు సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ తక్షణ చర్యలు చేపట్టేందుకు అనుగుణంగా డ్రైనేజీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. తీర గ్రామాల్లో నీటి సంఘాల అధ్యక్షులు, డీసీ ప్రతినిధులను సమన్వయం చేసుకుని వర్షపు నీరు డ్రైనేజీల ద్వారా సక్రమంగా తొలగిపోయేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నాగాయలంక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలోని వృద్ధాశ్రమానికి స్థానిక వ్యాపారులు చిట్టా శివనాగేశ్వరరావు తండ్రి కుటుంబ కోటేశ్వరరావు జ్ఞాపకార్థం గురువారం నిత్యావసర వస్తువులు, పండ్లను అందజేశారు. దివంగత తలశిల శ్రీనివాస్ కుటుంబసభ్యులు 25 కిలోల బియ్యాన్ని నిర్వాహకులు తలశిల మనోహర్‌కి అందించారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు, ఎస్సై సత్యనారాయణ

మోపిదేవిలో నాగులచవితికి విస్తృత ఏర్పాట్లు

మోపిదేవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25వ తేదీన నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. దేవస్థానం ఉద్యోగులు, ఎస్సై సత్యనారాయణతో కలిసి దేవస్థానంలో నాగుల చవితికి జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, రాబోయే రెండు రోజులు వర్షం కురిసినప్పటికీ భక్తులకు అసౌక ర్యం కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవస్థానం ఆవరణ, వెలుపల వాటర్ ప్రూఫ్ టెంట్లు, క్యూ లైన్లు ఏర్పా టు చేసి సత్వరమే నాగపుట్ట, స్వామివారి దర్శనం కలిగించేలా చూస్తామన్నారు. క్యూ లైన్‌లో ఎక్కువ సమయం లేకుండా స్వా మి దర్శనం చేసుకునేలా భక్తులు సహకరించాలన్నారు.



డ్రెయిన్‌లో తూటుకాడను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న టీడీపీ నాయకుడు చిట్టిబొమ్మ వనరాజు, నీటి సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

డ్రెయిన్లలో తూటుకాడ తొలగింపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బందరు డివిజన్‌లో శివగంగ డ్రైన్‌తో పాటు మైనర్ డ్రెయిన్లలో తూటుకాడ, గుర్రపుడెక్క వల్ల సుల్తానగరం, ఎస్.ఎన్. గొల్లపాలెం తదితర ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. సుల్తానగరం టీడీపీ నాయకుడు చిట్టిబొమ్మ వనరాజు, నీటి సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు హుటాహుటిన ఎక్స్‌కవేటర్ సహాయంతో తూటుకాడను తొలగించే ప్రక్రియ చేపట్టారు. దీంతో ఎస్.ఎన్. గొల్లపాలెం, పోతేపల్లి, సీతారామపురం తదితర ప్రాంతాల్లో పంట పొలాల్లోని వర్షపు నీరు తగ్గుముఖం పడుతోంది. మిగిలిన ప్రాంతాల్లో కూడా నీటి సంఘాల అధ్యక్షులు డ్రైన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించే ప్రయత్నాలు చేపట్టారు.

వ్యాన్‌బోల్తా

గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై చిట్టిగూడూరు వద్ద గురువారం కోళ్లవ్యాను బోల్తా పడింది. మచిలీపట్నంలో కోళ్లు అన్‌లోడ్ చేసి విజయవాడ వెళుతున్న వ్యాన్‌కు గేదె అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేకు వేయగా ఒక్కసారిగా బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తూ ఎవరికి ఏ ప్రమాదం జరగలేదు.



శివారు కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ బాపిరాజు



బుద్దాలపాలెంలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముంపు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కమిషనర్ బాపిరాజు లోతట్టు డ్రైవర్స్ కాలనీ, సుందరయ్యనగర్, కరెంటు కాలనీ, గనిపిశెట్టి గోపాల్ నగర్‌లను సందర్శించారు. మోటార్లతో వర్షపు నీరు తోడించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చి తాగాలని సూచించారు. కమిషనర్‌తో పాటు టీడీపీ కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు పర్యటించారు. బందరు మండలం బుద్దాలపాలెం, బొర్రపోతుపాలెం గ్రామాల్లోని పంట పొలాలను గురువారం వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కె. నాగేంద్రరావు మాట్లాడుతూ, నేలకొరిగిన దుబ్బులను లేవదీసి కట్టాలన్నారు. పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం. రామ్‌కుమార్, ఏఏఏ శిరీష, వన్నెం సునీల్, కొక్కు రామాంజనేయులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

భారీ వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తం కావడంతో వంటా వార్పు చేసుకోలేని పేదలకు గురువారం జగన్నాథ స్వామి గుడి, తదితర ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు ఆహార పొట్లాలు పంపిణీ చేశాయి. బైపాస్ రోడ్డులోని సంచారజాతుల వారికి చందన, శ్వేత ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. జగన్నాథ స్వామి ఆలయం వద్ద ఐనవోలు పార్థసాయి, లంకిశెట్టి బాలాజీ, ఐనవోలు భాగ్యలక్ష్మి, అంజిబాబు పేదలకు అన్నదానం చేశారు.



ఆహారపొట్లాలు అందజేస్తున్న చందన, శ్వేత



అన్నదానం చేస్తున్న బాలాజీ

కార్తీకమాసం శివునికి ప్రీతికరం



పురాణ ప్రవచనం చేస్తున్న సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : శివునికి ప్రీతికరమైన కార్తీక మాసంలో శివారాధన చేయడం వల్ల అన్ని రంగాల వారికి మేలు జరుగుతుందని సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ అన్నారు. కార్తీకమాసోత్సవాల్లో భాగంగా రాబర్టుసన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం చింతలపాటి మురళీకృష్ణ కార్తీకపురాణాన్ని ప్రవచించారు. కార్తీక దీపం, కార్తీకస్నానం, ఆకాశ దీపాలు వెలిగించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పరమశివుని అభిషేకాల్లో పాల్గొనడం వల్ల ఈతిబాధలు తొలగిపోతాయన్నారు. కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, బచ్చుపేట మల్లేశ్వరస్వామి, ఈడేపల్లి జోడుగుళ్ళు, గొడుగుపేట శాంతామల్లేశ్వర స్వామి దేవాలయాల్లో పరమశివునికి అభిషేకాలు, అర్చనలు చేశారు.



విశేష అలంకరణలో లక్ష్మీపురంలోని సోమేశ్వరస్వామి

శివాలయాల్లో కార్తీకశోభ

చల్లపల్లి : కార్తీకమాసం కావటంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాలు కురుస్తున్నప్పటికీ వేకువజామునే భక్తులు స్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి శివారాధనలో పాల్గొంటున్నారు. మహిమాన్విత శైవక్షేత్రం నడకుదురు పృథ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఉదయాన్నే వెళుతున్నారు. కృష్ణానదిలో స్నానమాచరించి స్వామివారికి పూజలు చేస్తున్నారు. లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అమ్మ వారికి కుంకుమార్చనలు, శివచాలీసా పారాయణం చేశారు. చల్లపల్లి అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, పాగోలు పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.



108 కిలోల కుంకుమతో రామలింగేశ్వరస్వామికి అభిషేకం

నాగాయలంక : గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు జరుగుతున్నాయి. కార్తీకమాసం రెండోరోజు 108 కేజీల కుంకుమతో సాయి కౌశిక్ బ్రహ్మత్వంలో అభిషేకాలు జరిగాయి. భక్తులు విరివిగా స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీరామ పాదక్షేత్రం కమిటీ పర్యవేక్షించింది.